J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74

నెల్లూరు, 31.07.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 09 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



## జై శ్రీరామ్

భారతీయుల చిరకాల కోరిక నెరవేరబోతోంది అయోధ్య రామయ్య కోసం మందిర నిర్మాణానికి పునాది రాయి పడుతుంది. ఆగస్టు 5, 2020 ఈ మహత్కార్యానికి శుభ ముహూర్తంగా నిర్ణయించబడింది. 11లో

## 'రఫేల్' వచ్చేశాయి



ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'రఫేల్' విమానాలు మన దేశానికి వచ్చేశాయి. అరివీర భయంకరమైన, శత్రుదుర్భేధ్యమైన ఈ యుద్ధ విమానాలు లక్ష్యాన్ని చేధించడంలో సాటిలేనివి.

(వివరాలు 7వ పేజీలో)

• తెలుగు రాష్ట్రాల్లో...

# కమలం 'కాపు' కాస్తోంది

## ➤ కన్నాకి ఉద్వాసన.. సోముకి సింహాసనం

**తెలుగు రాష్ట్రాల్లో జయాపజయాలను ప్రభావితం చేసే స్థాయిలో ఓట్లు ఉన్న కాపు సామాజికవర్గంపై కమలనాథులు కన్నేశారు. తెలంగాణతో పాటు ఆంధ్రాలో కొత్తగా జరిగిన రథసారథుల నియామకాల్లో పాత కాపుని తీసి కొత్త కాపుని పెట్టడంతో వాళ్ళ ఉద్దేశం స్పష్టమైంది.**

వాస్తవానికి రెండు రాష్ట్రాల్లో ప్రస్తుతం అధికారం చెలాయిస్తున్న పార్టీలు, ప్రతి పక్ష పార్టీల కంటే సంఖ్యాబలం ఎక్కువగా ఉన్న కాపు సామాజిక వర్గాన్ని ప్రోత్సహించడం ద్వారా వచ్చే ఎన్నికలలో వీలైనంత ఎక్కువ ఓట్లు సాధించాలన్న లక్ష్యం బీజేపీలో స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణలో వెలమలు, కమ్మలు టిఆర్ఎస్‌తో ఉంటే, రెడ్లు కాంగ్రెస్‌ని లీడ్ చేస్తున్నారు. దీంతో బీజేపీ మొన్నటి వరకు పార్టీ చీఫ్‌గా ఉన్న మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందిన ప్రొఫెసర్ లక్ష్మణ్‌ని పక్కనపెట్టి దూకుడుగా వ్యవహరించే అదే సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్‌ని కొత్త సారథిగా నియమించారు.

ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే సామాజిక వర్గాల ప్రాధాన్యం అత్యధికంగా ఉండే రాష్ట్రంగా పేరు... ఇప్పటికే కులాల వారీగా పార్టీలు అన్న చందంగా 'కమ్మ'లు టీడీపీకి దన్నుగా ఉంటే రెడ్లు వైయస్సార్సీపీని లీడ్ చేస్తున్నారు. ఇలాంటి సందర్భంలో దాదాపు 20 శాతం ఓట్లు ఉన్న

(మిగతా 11వ పేజీలో)



• చంద్రపడియలో పేలిన పరిశ్రమ

## పగిలిన గుండెలు



3లో

• తాడేపల్లి చేరిన గూడూరు పోరు

## ఇలా అయితే ఎలా నాన్నా...




5లో

• దగ్గరగా వున్నా...

## దూరమైపోతున్న మదరాసు



12లో





కొత్తగా జిల్లాకు వచ్చిన కలెక్టర్ చక్రధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం చెప్తున్న వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ తిరుపతి, బాపట్ల పార్లమెంటు నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి.

## పెద్దాసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌గా శశికాంత్

నెల్లూరులోని ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఫోరెన్సిక్ నిపుణుడు శశికాంత్ నియమితులయ్యారు. జిల్లాలో కోవిడ్ కేసులు ఎక్కువవుతున్న నేపథ్యంలో విధులను సమన్వయం చేసేందుకు అధికారులు ఆయన్ను నియమించినట్లు సమాచారం.

• మాతృభాష

# నిర్బంధమా... స్వచ్ఛందమా...?

34 ఏళ్ళ తరువాత నూతన జాతీయ విద్యా విధానం తీసుకువచ్చింది కేంద్రం. జాతీయ విద్యా విధానంలో కీలక మార్పులు చేస్తూ బుధవారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మూడున్నర దశాబ్దాల తరువాత అనేక కొత్త సంస్కరణలు తీసుకువస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ఉన్న 10+2+3 విధానంలో మార్పులు చేశారు. ఇప్పటి వరకు పదవ తరగతి, ఇంటర్, తరువాత డిగ్రీ మూడేళ్ళు ఉండేది. ఇక నుంచి డిగ్రీ నాలుగేళ్ళు ఉంటుంది. అలాగే మూడేళ్ళ నుంచి 18 ఏళ్ళ వరకు విద్యను కంపల్సరీ చేశారు. ప్రతిభ ఉన్న వారిని వెలికి తీసేలా ఉండే గైడ్‌లైన్స్ కూడా తెచ్చారు. ఇక మరో కీలకమైన విషయం ఏమిటంటే 5వ తరగతి

### కేంద్రం కొత్తగా తెచ్చిన చట్టం ఏం చెబుతోంది

వరకు మాతృభాషలోనే విద్యా బోధన ఉండాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. మాతృభాష, ప్రాంతీయ భాషల్లో విద్యా బోధన ఉండాలని, తన గైడ్‌లైన్స్‌లో కేంద్రం తెలిపింది. వీలయితే 8వ తరగతి వరకు కూడా మాతృభాషలోనే విద్యా బోధన ఉండేలా చూడాలని కేంద్రం స్పష్టం చేసింది. అలాగే కేంద్ర మానవ వనరుల శాఖ పేరును విద్యాశాఖగా కూడా మార్పు చేసింది. అయితే కేంద్రం అమలులోకి తెచ్చిన కొత్త విద్యా విధానంలో మాతృభాషలో బోధనను తప్పనిసరి చేసిందా?

ఇంగ్లీషు మాధ్యమంలో బోధించాలంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమలు కాబోదంటూ వస్తున్న వార్తలలో నిజమెంత అన్నది

### ఒక్కసారి క్షుణ్ణంగా పరిశీలిస్తే ...


జాతీయ విద్యా విధానం అన్నది మార్గదర్శక సూత్రాలు కలిగిన డాక్యుమెంట్ అది. ఏ రాష్ట్రానికైనా అన్వయించుకోవలసిన అవసరం, పాటించే పరిస్థితులు ఉంటే ఆ సూత్రాన్ని వాడుకోవచ్చు. రాష్ట్రాల విధి విధానాలు అవసరాల మేరకు, వారి వారి ఆకాంక్షల ప్రకారం దీన్ని పాటించవచ్చు. విద్య అన్నది కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలో ఉన్నందున కొత్త విద్యావిధానం అమలు కావాలంటే రాష్ట్రాల తోడ్పాటు కూడా అవసరమని కేంద్రం స్పష్టంగా చెప్పింది. అందువల్ల ఎవ్వరిమీద కూడా బలవంతంగా రుద్దజాలమని కేంద్రం చెప్తోంది. కొత్త విద్యావిధానంలో ఇచ్చిన సూచనలు అన్నీకూడా విద్యార్థుల అభీష్టాలమీదే ఆధారపడి ఉంటాయి. మొదటి సారిగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మాతృభాషా మాధ్యమం ఉండాలన్న సూచన చేశారు. ప్రైవేటు స్కూళ్లలోనూ ఇది వర్తింప చేయాలన్నది నూతన విద్యావిధానంలో ఒక కొత్త సూచన. కాని ప్రైవేటు స్కూల్లో తెలుగు మీడియం కూడా పెట్టాలని ఇటీవల ఏపీ హైకోర్టులో పిటిషన్ వేస్తే దాన్ని డివిజన్ బెంచ్ కొట్టేసింది. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల హక్కులకు భంగం కలిగించలేమని చెప్పింది. దీని అర్థం ఏంటంటే... కొత్త విద్యావిధానం అన్నది సాధ్యాసాధ్యాలమీద ఆధారపడి ఉంటుంది. కొత్త విద్యావిధానం అన్నది దిశానిర్దేశం కాదు.. దిశామార్గదర్శకం మాత్రమే. విద్యార్థులపై ప్రత్యేకంగా ఒక మీడియాన్ని రుద్దలేం, ఏ మీడియంని ఎంపిక చేసుకోవాలన్నది విద్యార్థుల ఇష్టాఇష్టాలమీద ఆధారపడి ఉంటుంది. కేంద్రం కొత్తగా తెచ్చిన నూతన విద్యా విధానాన్ని క్షుణ్ణంగా చదివితే ఇది అర్థం అవుతుంది. కాబట్టి మాతృభాష స్వచ్ఛందమే కానీ నిర్బంధం కాదు.

## మరో రెండు 'సంజీవని' బస్సులు

జిల్లాలో కరోనా నిర్ధారణ పరీక్షల కోసం రాష్ట్రప్రభుత్వం పంపిన మరో రెండు బస్సులు ఈనెల28న నెల్లూరుకు వచ్చేశాయి. వీటితో ఈ బస్సుల సంఖ్య ఏడుకు చేరింది. వీటిని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎస్పీ భాస్కర్‌భూషణ్, జాయింట్ కలెక్టర్లు డా. వినోద్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డిలు పరిశీలించారు. ఒక్కో సంజీవని బస్సు ద్వారా కనీసం 500 దాకా కరోనా నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు.

## కృషివిజ్ఞాన కేంద్రానికి అవార్డులు

జిల్లాలోని వెంకటగిరిలో ఉన్న కృషి విజ్ఞానకేంద్రానికి రెండు ప్రతిష్టాత్మక అవార్డులు లభించాయి. హైదరాబాద్ కెవికె (కృషి విజ్ఞాన కేంద్రం) వార్షిక జోన్ వారు పలు అంశాలపై చేపట్టిన జూమ్ సమావేశంలో ప్రతిభ చాటినందుకు వెంకటగిరి కృషి విజ్ఞాన కేంద్రానికి ఒక అవార్డు, బాగా అభివృద్ధి సాధిస్తున్నందుకు మరొక అవార్డు ప్రకటించారని ఆ కేంద్రం అధిపతి డాక్టర్ గోవిందరాజులు తెలిపారు.



ఆగస్టు 5న..

# బెజవాడ గోపాలరెడ్డి 113వ జయంతి

● సంస్మరించుకోలేకపోతున్న రాజకీయ నేతలు, అధికారులు



స్వాతంత్ర సమరయోధునిగా, ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా, ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ఆ తరువాత ఉత్తరప్రదేశ్ గవర్నరుగా ఎన్నో కీలక పదవులను అలంకరించి, మచ్చలేని రాజకీయ ఉద్దండుడిగా ఎదిగిన ధీశాలి, అనన్య సామాన్య ప్రతిభాశాలి, అన్నింటినీ మించి నెల్లూరు ముద్దుబిడ్డ డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారి 113వ జయంతి ఆగస్టు 5న రానుంది.

ఇంతటి గొప్ప నేతను సంస్మరించుకోవడంలో మన నేతలు, జిల్లా అధికారులు పూర్తిగా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని గోపాలరెడ్డి అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోపాలరెడ్డి గారి శత జయంతి సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యులు తిక్కవరపు సుబ్బరామిరెడ్డి, ప్రస్తుత రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిల హార్ధిక, ఆర్ధిక సహకారంతో 2007వ సంవత్సరంలో బెగోరే అభిమానులు ఒక కమిటీగా ఏర్పడి నెల్లూరులోని మినీ బైపాస్ లోని మాగుంట లే అవుట్ కూడలిలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటుచేసి దివంగత మహానేత, అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి గారి చేతులమీదుగా ఆవిష్కరింప చేశారు. అప్పటినుండి ఆ విగ్రహ ఆలనా పాలనా విగ్రహ కమిటీ వారే చూస్తున్నారే తప్ప, కనీసం ఆగస్టు5.. ఆయన జయంతి రోజున కానీ.. మార్చి 9న ఆయన వర్ధంతి రోజున కానీ అటు రాజకీయపార్టీలు, ఇటు అధికార యంత్రాంగం ఎవ్వరూ గోపాలరెడ్డి గారిని సంస్మరించుకోకపోవడం శోచనీయం. కనీసం ఈ ఏడాది నుండైనా రాజకీయ నేతల చొరవతో అధికారులు పట్టించుకుని ఆ మహనీయుడికి సముచిత గౌరవం ఇవ్వాలని గోపాలరెడ్డి అభిమానులు కోరుతున్నారు.

# కోవిడ్ నియంత్రణకు.. కంటైన్‌మెంట్ జోన్లు

జిల్లాలో కరోనా ఉధృతి కొనసాగుతూనే ఉంది. ఈనెల 27వ తేది సోమవారం ఒక్కరోజే జిల్లాలో 331 కేసులు రావడంతో మొత్తం కేసులు 5016కు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో కోవిడ్ వైరస్‌ను కట్టడి చేసేందుకు అధికారులు గ్రామాలు, వార్డులతో సహా 386 చోట్ల కంటైన్‌మెంట్ జోన్లను ప్రకటించి, ఆయా ప్రాంతాల్లో వైరస్ నియంత్రణకు పెద్దఎత్తున చర్యలు తీసుకుంటున్నారు. కంటైన్‌మెంట్ జోన్లు నెల్లూరు నగరంలో 86 ఉండగా, రూరల్‌లో 26 ఉన్నాయి. అదేవిధంగా జిల్లాలోని కోవూరులో 16, కొండాపురంలో 4, ముత్తుకూరులో 11, పొదలకూరులో 9, బుచ్చిలో 14, విడవలూరులో 2, కావలిలో 25, జలదంకిలో 6, వరికుంటపాడులో 4, కలిగిరిలో 3, బోగోలులో 5, కొడవలూరులో 13, ఇందుకూరుపేటలో 4, మనుబోలులో 3, వింజమూరులో 2, సంగంలో 4, ఎస్ఆర్‌పురంలో 5, ఏఎస్‌పేటలో 5, ఆత్మకూరులో 5, కలువాయిలో 4, ఉదయగిరిలో 5, మర్రిపాడులో 2, సూళ్లూరుపేటలో 14, తడలో 10, నాయుడుపేటలో 4, ఓజిలిలో 2, డివి సత్రంలో 3, పెళ్ళకూరులో 3, గూడూరులో 17, వెంకటగిరిలో 23, కోటలో 5, చిట్టమూరులో 8, సైదాపురంలో 4, బాలాయపల్లిలో 6, చిల్లకూరులో 6, దక్కిలి, అల్లూరు, రాపూరు, చేజర్ల, వాకాడుల్లో ఒక్కొక్కటి వంతున కంటైన్‌మెంట్ జోన్లను అధికారులు ప్రకటించారు.

# ఎన్టీఆర్ విగ్రహం తొలగింపు దుర్మార్గం

\- మాజీమంత్రి సోమిరెడ్డి ఆగ్రహం



కావలి సమీపంలోని ముసునూరు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించడం దుర్మార్గమని మాజీమంత్రి, టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఈనెల 29న ఆయన జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును కలిసి ఎన్టీఆర్ విగ్రహ సమస్యను ప్రభుత్వమే పరిష్కరించాలంటూ వినతిపత్రం సమర్పించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలుగుబిడ్డ, తెలుగువారికి గుర్తింపు తెచ్చిన మహానుభావుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహం తొలగింపు దారుణమన్నారు. వైకాపా కార్యకర్తలు ఈ దురాగతానికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, నాయకులు తాళ్లపాక రమేష్‌రెడ్డి, తాళ్ళపాక అనూరాధ, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలతో పాటు ఎన్టీఆర్ అభిమానులు ఉన్నారు.





జిల్లాలో అడుగుపెట్టి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి క్షణం తీరిక లేకుండా ఓవైపు కరోనా బాధితుల అవసరాలను, వారి ఇబ్బందులను గుర్తించి వారి కష్టాలు తీరుస్తూ... మరోవైపు జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షిస్తూ చురుకైన అధికారిగా పేరు తెచ్చుకుంటున్న కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబును సత్కరించి, 'లాయర్' ఇటీవల ప్రచురించిన 'సింహపురికి వన్నెతెచ్చిన వనితలు' కాఫీటేబుల్ బుక్‌ను అందజేస్తున్న తుంగా శివప్రభాత్‌రెడ్డి(ప్రభు).

# నగరంలో కొత్త షాపింగ్ కాంప్లెక్స్‌లు

\- మంత్రి డా.అనిల్



నెల్లూరు నగరంలో పాత షాపింగ్ కాంప్లెక్స్‌లు తొలగించి వాటి స్థానంలో అత్యాధునికమైన రీతిలో కొత్తవాటిని నిర్మించనున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా.పి.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఈనెల29న ఆయన నగరంలోని నర్తకి సెంటర్, కనకమహల్‌సెంటర్, గాంధీబొమ్మ సెంటర్‌లలో అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కనకమహల్ సెంటర్ నుంచి ములుముడి బస్టాండ్ సెంటర్ వరకు ఉన్న డివైడర్లను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా రోడ్డును విస్తరిస్తామన్నారు. అదేవిధంగా అర్చన సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్‌ల వద్ద ఉన్న పాత షాపింగ్ కాంప్లెక్స్‌లను తొలగించి వాటిస్థానంలో కొత్తవి నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాలని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. రామలింగాపురం ఫ్లైఓవర్ నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని చెప్పారు.

# పేలిన పరిశ్రమ.. పగిలిన గుండెలు

- ఒకరు మృతి.. తీవ్రగాయాలతో మరో ముగ్గురు కార్మికులు
- చంద్రపడియలో సంఘటనా స్థలాన్ని సందర్శించిన కలెక్టర్, ఎస్పీ
- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలన్న ఉపరాష్ట్రపతి



విశాఖ ఎల్జీ పాలిమర్స్ ఫ్యాక్టరీలో ఇటీవల జరిగిన పేలుడు ప్రమాదం మరచిపోకముందే.. నెల్లూరుజిల్లాలోని వింజమూరు మండలం 'చంద్రపడియ' గ్రామంలో అదే తరహాలో జరిగిన పేలుడు ఆ గ్రామ ప్రజలను భయభ్రాంతులను చేసింది. జిల్లా ప్రజలను కూడా ఆందోళనకు గురిచేసింది. ఈ గ్రామంలో ఉన్న వెంకటనారాయణ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ఫార్మా కర్మాగారంలో ఈనెల 29న తెల్లవారుజామున 2.30గంటల ప్రాంతంలో ఉన్నట్టుండి పేలుడు సంభవించింది. ఆ ఫ్యాక్టరీ మొదటి అంతస్తులోని బాయిలర్ పెద్ద శబ్దంతో పేలిపోవడం, వెంటనే భగ్గుమంటూ మంటలు వ్యాపించడంతో ఆ పేలుడు శబ్దానికి గ్రామం ఉలిక్కిపడింది. ఏం జరిగిందో తెలుసుకునే లోపే నలుగురు కార్మికులు ఈ ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలతో వారు హాహాకారాలు చేశారు. అందులో ఒక కార్మికుడు చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు.

**కార్మికుల హాహాకారాలు :**

ప్రమాదం జరిగిన తర్వాత అక్కడున్న కార్మికులు హాహాకారాలు చేస్తూ బయటకు పరుగులెత్తారు. అప్పటికే అక్కడ పనిచేస్తున్న కార్మికులు బయ్యపురెడ్డి రవీంద్రరెడ్డి, నువ్వుల రజనీకుమార్, సయ్యద్ హఫీజ్, సూరా భాస్కర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వీరిని నెల్లూరులోని బొల్లినేని ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం వారిని హుటాహుటీగా మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తీసుకువెళ్లారు. హఫీజ్‌కు 90శాతం పైగానే శరీరం కాలిపోయింది. చికిత్స పొందుతూ ఆ కార్మికుడు మృతిచెందడంతో వారి కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది.

**ప్రమాదస్థలాన్ని సందర్శించిన కలెక్టర్.. ఎస్పీ**

ఫ్యాక్టరీలో పేలుడు విషయం తెలియగానే జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎస్పీ భాస్కర్‌భూషణ్‌లు వెంటనే సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందో ఆరా తీశారు. బాధితులకు మెరుగైన వైద్యచికిత్సలు అందేలా చర్యలు తీసుకుని, బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. ఈ ప్రమాద ఘటనపై విచారణకు నిపుణుల కమిటీని వేస్తున్నామని, వారి నివేదిక ఆధారంగా ఫ్యాక్టరీపై తదుపరి చర్యలుంటాయని, అంతవరకు ఫ్యాక్టరీని మూసి వేస్తున్నామని వారు తెలిపారు. బాధితులకు ప్రభుత్వం తరపున, యాజమాన్యం తరపునా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ కర్మాగారంలో సుమారు 400 మంది కార్మికులు పనిచేస్తున్నారని, అనేక రకాల ఔషధాలను ఇక్కడ తయారు చేస్తున్నారని తెలుస్తోంది. ఈ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో గ్రామమంతా దుర్వాసన వ్యాపిస్తోందని, ఎన్నిసార్లు ఆందోళనలు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని అక్కడి ప్రజలు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి తమ గోడు విన్నవించుకున్నారు.

**ప్రమాద ఘటనను ఆరా తీసిన ఉపరాష్ట్రపతి :**

చంద్రపడియ వద్ద ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదం గురించి బుధవారం ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌చేశారు. నలుగురు కార్మికులు తీవ్రగాయాల పాలైన విషయం తెలుసుకుని, వారికి వెంటనే మెరుగైన వైద్యం అందించాలని ఆయన జిల్లా కలెక్టర్‌కు సూచించారు. అదేవిధంగా సీతారామపురం మండలంలో కరోనా కేసులు నమోదు కావడంతో అక్కడికి ప్రత్యేక వైద్య బృందాన్ని పంపి వైద్యసేవలందించాలని ఆయన సూచించారు.

## 'ప్రభా'తం

'ఆపరేషన్ ముస్కాన్'..

ఈ పేరు వినడానికి కాస్త కొత్తగా ఉన్నా, చిన్నారుల్లో చిరునవ్వులు నింపుతూ.. వీధిబాలలకు వెలుగుబాట చూపుతున్న ఈ కార్యక్రమం ఇప్పుడు రాష్ట్రంలో మారుమోగిపోతోంది. ఎంతోమంది తప్పిపోయిన పిల్లలను వెతికి పట్టుకుని తిరిగి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చే ఈ కార్యక్రమం ఎంతోమంది అసహాయులు, అనాథలు, వీధిబాలలకు విముక్తి కలిగిస్తోంది. తల్లిదండ్రుల నిరాదరణకు గురైన ఎందరో అభాగ్యుల జీవితాల్లో కొత్తవెలుగులు ప్రసరింపజేసే ఈ మానవీయ కార్యక్రమం మన రాష్ట్రంలో ప్రత్యేకించి ముఖ్యమంత్రి వైయస్ జగన్ సూచనలతో, పోలీసుశాఖ..ఇతర అనేకశాఖల సమిష్టికృషితో ఎంతో చిత్త శుద్ధితో అమలవుతోంది. ఈ కార్యక్రమం ద్వారా వేలాదిమంది బాలబాలికలకు తిరిగి కొత్త జీవితాలు మొగ్గ తొడుగుతుండడం ఎంతైనా అపూర్వం..అభినందనీయం!

రాష్ట్రంలో తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన పిల్లలను, ఇంటినుంచి పారిపోయి ఎటువెళ్ళాలో తెలియక అయోమయంలో ఉన్నవారిని, బాలకార్మికులుగా మారినవారిని, బస్టాండ్లు, హోటళ్ళు, రైల్వేస్టేషన్లు, పార్కుల్లో యాచనచేస్తూ ఆకలి తీర్చుకుంటున్న చిన్నారులను గుర్తించి వారిని వారి తల్లిదండ్రుల వద్దకు తిరిగి చేర్చడం, వారికి మేమున్నామంటూ భరోసా ఇస్తూ పునరావాసం కల్పించడం.. ఇవన్నీ ఎంతో మానవీయమైన విషయాలు. రానురాను ఇలా తప్పిపోయిన బాలల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఈ సమస్యను పరిష్కరించడానికి 'ఆపరేషన్ ముస్కాన్' ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా పనిచేస్తున్న 'ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్'లో భాగంగా రాష్ట్రంలోనూ, అన్ని జిల్లాల్లోనూ ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్యంగా పేదరికం, ఇంకా రకరకాల కారణాలు.

ఏదేమైతేనేం ఎంతోమంది పిల్లలు తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి గురై వీధుల పాలవుతూనే ఉన్నారు. పుట్టింది ఆడపిల్ల కాబట్టి ఎక్కడో వదిలేసేవాళ్ళు, పిల్లల్ని పెంచడానికి తగ్గ ఆర్థికస్థితి లేక వదులుకునేవాళ్ళు, ఏ ప్రమాదం లోనో తల్లిదండ్రులిద్దరూ మరణించగా రక్తసంబంధీకులు కూడా పట్టించుకోకపోవడంతో వీధులపాలవు తున్న చిన్నారులు.. ఇలా ఎన్నో రకాల వ్యధలు!.. ఎవర్నని నిందించగలం?..ఏం చేయగలం?.. సమాజంలో ఎంతో కాలం నుంచి ఇలాంటి సంఘటనలు మనసుల్ని కలచివేస్తూనే ఉన్నాయి. వీధుల్లో యాచన చేస్తూ చిన్నబిడ్డలు కొందరు ఏ చెట్టుకిందనో, రోడ్డుపక్కనో ఆదమరచి నిద్రపోతున్న దయనీయ దృశ్యాలు.. ఎన్నెన్నో!.. అయితే అలాంటి అభంశుభం తెలియని అభాగ్యులకు కూడా మనవంతు సేవ చేద్దామంటూ ప్రభుత్వం రంగంలోకి దిగడం..వారిని తిరిగి తల్లిదండ్రుల చెంతకో, పునరావాస కేంద్రాలకో చేర్చి రక్షణ కల్పించేందుకు సమాయత్తం కావడం, ఎంతో అభినందించాల్సిన విషయం. కన్నవాళ్ళు, అయినవాళ్ళు ఎవరూ పట్టించుకోకుండా చిన్నతనంలోనే ఆ చిన్నపిల్లల్ని రోడ్లమీద వదిలేస్తే..ఆ పిల్లలు ఎలా బతకాలి?.. వారికి రక్షణ ఎవరిస్తారు?..అందులోనూ ఈ కరోనా కష్టకాలంలో వీధుల్లో యాచన చేస్తూనో..ఎక్కడెక్కడో పనిచేస్తూనే బతికే ఆ చిన్నారుల దయనీయస్థితిని పట్టించుకునే వారెవరు?... ఇలాంటి ఆలోచనలకు ప్రతిరూపమే 'ఆపరేషన్ ముస్కాన్'. ఒక్కమాటలో చెప్పాలంటే అలాంటి అభాగ్యులు... అసహాయులైన బాలల జీవితాలకిదో రక్షరేకు!...

రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది బాలల జీవితాలు రకరకాల సమస్యల చిక్కుముడిలో చిక్కుకుపోయి వారి జీవితాలు అంధకారంలో మగ్గుతున్న తరుణంలో వారిని గుర్తించి, వారిని ఆ బాధలనుంచి తప్పించి, వారు తిరిగి సజావుగా బతికేలా చేయాలనుకోవడమే ఒక గొప్ప సంకల్పం. అంతటి మహత్కార్యానికి ప్రభుత్వాలు శ్రీకారం చుట్టడం ముదావహం. 2019లో ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో 5739 మంది చిన్నారులను ఆంధ్రప్రదేశ్ పోలీసులు రక్షించారు. ఇది పోలీసుశాఖకే గర్వకారణం. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూలై 14 నుంచి 20వ తేది వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒకే ఒక్క వారంలో.. 4806 మంది బాలబాలికలకు విముక్తి కలిగించినట్లు డిజిపి గౌతంసవాంగ్ పేర్కొన్నారు. ఇలా ఎందరో బాలల జీవితాలకు రక్షణ కల్పిస్తూ 'ఆపరేషన్ ముస్కాన్' అందరి ప్రశంసలకు పాత్రమవుతోంది. రాష్ట్ర పోలీసు శాఖతో పాటు మహిళా శిశు సంక్షేమశాఖ, కార్మికశాఖ, విద్యాశాఖ, వైద్యఆరోగ్య శాఖలు, రెవెన్యూ, క్రీడా శాఖలతో పాటు స్వచ్ఛంధసంస్థలు, బాలల సంక్షేమ కమిటీలు పాల్గొన్నాయి. ఇంతపెద్దఎత్తున అనేక శాఖల వారు, జిల్లాల్లో పోలీసులు అందరూ రంగంలోకి దిగారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్ ప్రాంతాలు, హోటళ్ళ వద్ద, బ్రిడ్జిల వద్ద ఇలా అనేక ప్రాంతాల్లో వారికోసం వెదికారు. అయోమయంగా జీవితాలు గడుపుతున్న ఎందరో బాలబాలికలను వెతికి వెతికి వెలుగులోకి తెచ్చారు. మొత్తం 4,806 మంది బాలబాలికలను గుర్తించారు. వీరిలో అత్యధిక శాతం మంది.. అంటే 4703 మందిని తిరిగి వారిని వాళ్ల తల్లిదండ్రులకు అప్పగించారు. మిగిలిన 103 మందిని బాలబాలికల పునరావాస కేంద్రాల్లో చేర్చి వారికి రక్షణ కల్పించారు. వీరిలో అనేకమందికి కరోనా పరీక్షలు చేయించగా ముగ్గురికి పాజిటివ్ రావడంతో వారికి వైద్యసౌకర్యం అందజేస్తున్నారు కూడా. ఇంతకంటే మానవీయ కార్యక్రమం ఏముంటుంది!..తప్పిపోయిన తమ బిడ్డలను ప్రభుత్వమే వెదికి తెచ్చి ఇచ్చిందని.. ఆ పుణ్యమంతా ప్రభుత్వానిదేనని ఎంతో సంతోషంతో.. ఆనందబాష్పాలతో చెప్తున్నారు ఆ తల్లిదండ్రులు!.. ఇంతకన్నా ఆనందం ఎవరికైనా ఏం కావాలి?!... అయితే, ఇక్కడొక మాట. తల్లిదండ్రులు కూడా బాధ్యతగా ఉంటూ బిడ్డలను వీధులపాలు చేయకుండా సంరక్షించుకుంటూ భావిభారత పౌరులుగా వారిని తీర్చిదిద్దుకోవాలి. అందుకు సమాజంలోని అందరూ వారికి తగు చేయూతనివ్వాలి.

ఏదేమైనా..మానవత్వం ఇంకా బతికేవుందని చాటిచెప్తూ...'ఆపరేషన్ ముస్కాన్'.. ఈ విషయంలో ఎంతో ముందడుగు వేయడం ఎంతైనా అభినందనీయం!...

### వీధిబాలలకు వెలుగు బాట



ఈ ఏడాది జూలై 14 నుంచి 20వ తేది వరకు రాష్ట్రవ్యాప్తంగా 4806 మంది బాల బాలికలకు విముక్తి కలిగించడం ద్వారా 'ఆపరేషన్ ముస్కాన్' కార్యక్రమం అందరి ప్రశంసలను అందుకుంటోంది. ఆ బాలల్లో 4703 మందిని తిరిగి వాళ్ల తల్లి దండ్రులకు అప్పగించారు. 103 మంది బాలబాలికలను పునరావాస కేంద్రాల్లో చేర్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మానవీయ హృదయంతో చేపట్టిన ఈ కార్యక్రమం వేలాదిమంది వీధిబాలలకు వెలుగుబాటలు పరుస్తోంది. ఇంతకంటే మానవీయ కార్యక్రమం ఏముంటుంది!..

---

### కరోనా నుంచి కాపాడాలంటూ..
## మూలస్థానేశ్వరాలయంలో మృత్యుంజయ హోమం

కరోనా మహమ్మారి వ్యాధి నుంచి ప్రజలను కాపాడాలంటూ నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో ఆలయ అర్చకులు ఎంతో భక్తిశ్రద్ధలతో మహారుద్ర సహిత మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఈనెల 27న ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు కలసి తొలుత స్వామివారికి, అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. వైయస్సార్సీపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పి.రూప్‌కుమార్‌యాదవ్, ఆలయ ఛైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇ.ఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రామలింగేశ్వరస్వామికి ఏకాంతంగా పూజలు

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన విడవలూరు మండలం రామతీర్థంలోని కామాక్షి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 27 నుంచి ఆగస్టు 10వ తేది వరకు ఏకాంతంగానే పూజలు జరుగుతాయని, ఈ పదిహేను రోజులూ భక్తులకు అనుమతి ఉండదని ఆలయ ఇ.ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో కరోనా కేసులు ఎక్కువగా ఉండడమే కాక, ఇతర జిల్లాల్లోని కంటోన్మెంట్ ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఇక్కడికి వస్తున్న దృష్ట్యా ఈ వ్యాధి విజృంభించకుండా ప్రజల శ్రేయస్సు కోసం ఈ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంటూ భక్తులు సహకరించాలని కోరారు.

### పెంచలకోన ఆలయంలో..
## నిత్యాన్నదానానికి లక్ష విరాళం

రాపూరు మండలంలోని పెంచలకోనలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో నిత్యాన్నదాన పథకానికి వైయస్సార్ కడపజిల్లాలోని చిన్నచౌక గ్రామానికి చెందిన చింతగుంట హరిప్రసాద్‌రెడ్డి, సుస్మితారెడ్డి దంపతులు ఈనెల 26న దేవస్థానానికి విచ్చేసి శ్రీవారి నిత్యాన్నపథకానికి లక్ష రూపాయల విరాళమిచ్చారు. ఆ చెక్కును ఆలయ అర్చకులు, సిబ్బందికి అందజేశారు. అనంతరం అర్చకులు వీరికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి, ప్రసాదాలిచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శశిస్వామి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఈ-మెయిల్
ప్రజావాణి
roopagroup@yahoo.com

## సామాన్యుడిని దోచుకుంటున్నారు

కరోనా మహమ్మారి ఒకవైపు సామాన్య మానవుడిని అష్టకష్టాలపాలు చేస్తుంటే.. అటు ప్రయివేటు రంగంలోనూ, ఇటు ప్రభుత్వ రంగంలోనూ ప్రజలను దోచేసు కుంటున్నారు. పరిస్థితులను అడ్డంపెట్టు కుని అధికభారం మోపుతున్నారు. చిల్లర దుకాణ యజమానులు సైతం తమ నోటికి వచ్చిన రేట్లను చెప్పి సరుకులు అమ్ముతు న్నారు. మరోవైపు కేంద్రప్రభుత్వం కూడా సాధ్యమైనంత మేరకు ప్రజలనుండి దోచు కోవడానికే చూస్తుండడం దారుణమైన విషయం. వలస కార్మికులను తరలించ డానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక రైళ్ల ద్వారానే రైల్వే శాఖకు 400 కోట్ల రూపాయలు వచ్చాయని గొప్పగా ప్రకటించుకోవడమే ఇందుకు పెద్ద ఉదాహరణ. ఇక మాస్కుల పైనా, శానిటైజర్లపైనా, పిపిఈ కిట్లపైన కూడ జియస్‌టి పేరుతో ప్రజలపైన భారమేసి బాదేస్తున్నారు. ప్రజా సంక్షేమమే తమ ప్రధాన అజెండా అని చెప్పుకునే మోడీ పరిపాలనలో కూడా ఇలా జర గడం దారుణం.

**పి.సుబ్రహ్మణ్యం,**
**బాలాజీనగర్, నెల్లూరు.**

## అనాథల్లా.. అంతిమ సంస్కారాలు

2020వ సంవత్సరం ప్రపంచ మాన వాళి జీవితాలలో అంతులేని విషాదాన్ని నింపడమే కాకుండా చనిపోయిన వారికి సైతం ఆత్మశాంతి లేకుండా చేస్తోంది. కరోనా దెబ్బకు కోట్లాదిమంది వణికి చస్తుంటే, లక్షలాదిమంది దాని కోరల్లో చిక్కుకుంటున్నారు, వేలాదిమంది ప్రాణాలు కోల్పోతున్నారు.

ఈ జబ్బు బారిన పడి ఆసుపత్రుల్లో, ఇళ్లల్లో చికిత్స చేయించుకుంటున్నవారి గోడు ఒకరకంగా ఉంటే.. ఈ మాయదారి జబ్బుతో చచ్చిపోయిన వారి కుటుంబాల పరిస్థితి మరీ దీనంగా ఉంటోంది. చని పోయిన వ్యక్తి శవాన్ని కూడా చూడడానికి బంధువులను అనుమతించడం లేదు, ఈ కరోనా జబ్బుతో చనిపోయినవారి కుటుంబ సభ్యుల దీన గాథలు పత్రికల్లో చదువు తుంటే హృదయం ద్రవిస్తోంది. అంతిమ యాత్రలకు కూడా ఒకరినో ఇద్దరినో కుటుంబసభ్యులను మాత్రమే అనుమతిం చడం అమానుషమైతే, కొన్ని చోట్ల అసలు శవాన్ని చూడడానికి కూడా ఎవ్వరూ ముందుకు రాకపోవడం ఘోరాతి ఘోరం. అనాథల్లా కొందరి అంతిమ సంస్కారాలు జరుగుతున్న తీరు వింటుంటే పగవారికి కూడా ఇలాంటి దుస్థితి రాకూడదని అనిపిస్తుంది.

**పుట్టా హరిత, గూడూరు.**

## నేతాజీవీధిలో అగచాట్లు

నెల్లూరు, 54వ డివిజన్ నేతాజీరోడ్డు మధ్యలో గతంలో మ్యాన్‌హోల్స్ తవ్వి వదిలేశారు. దీంతో రోడ్డంతా అస్తవ్యస్తంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే అవస్తగా ఉంది. ద్విచక్రవాహనాల రాక పోకలకు మరీ ఇబ్బంది కలుగుతోంది. అధికారులు ఈ రోడ్డును బాగుచేయాలి.

**- నేతాజీవీధి నివాసులు**

### కార్గిల్ అమరవీరులకు
## జోహార్లు

జూలై 26వ తేదీ 'కార్గిల్ విజయ్ దివస్'ను ప్రతి భారతీయుడు సగర్వంగా జరుపుకున్నాడు. 1999 జూలై 26న కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్‌పై భారత్ విజయం సాధించింది. అప్పటినుండి విజయ్ దివస్‌గా ఈ రోజును జరుపుకోవడం ఆన వాయితీ అయ్యింది. ఆనాడు యుద్ధంలో అమరులైన వీర జవానులకు జోహార్లు. దేశం కోసం ప్రాణాలర్పించి, వారు చేసిన త్యాగం ఈ భారతజాతి ఎప్పటికీ మర్చి పోదు. ఇలాంటి స్మారక దినాలు భావి భారత పౌరులను స్ఫూర్తివంతం చేసి చైతన్యవంతులను చేస్తాయనడంలో సందేహం లేదు. జై జవాన్....!

**బి.లక్ష్మీధర్, బెల్గామ్, కర్ణాటక.**

# ఇలా అయితే ఎలా నాన్నా...



- పార్టీ పెద్దలు సజ్జల, విపిఆర్, బాలినేనిల సమక్షంలో గూడూరు ఎంఎల్‌ఏని నిలదీసిన రామ్‌కుమార్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, శ్యాంప్రసాద్‌రెడ్డి
- తాడేపల్లికి చేరిన గూడూరు పోరు













***పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులు, వాలంటీర్ల నియామకాలు, షిఫ్ట్ ఆపరేటర్ల ఉద్యోగాలు, ఉద్యోగస్తుల బదిలీలు, ప్రమోషన్లు, స్థానిక ఎన్నికలలో బి-ఫారాల పంపిణీ.. ఇలా అదీఇదీ అని లేకుండా అన్నింటిలో బేరసారాలు, కాంట్రాక్టు వర్కులలో పర్సంటేజీలు, ఇసుక రీచిల్లో కమీషన్లు... ఇలా గూడూరు నియోజకవర్గంలో జరుగుతున్న దండకాల భాగోతం, నాయకుల కుమ్ములాట తదితర అంశాలపై జులై 23వ తేది తాడేపల్లిలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సుదీర్ఘ పంచాయతీ జరిగిందని విశ్వసనీయ సమాచారం.***

నెల్లూరు పార్టీ ఇన్‌చార్జ్ సజ్జల రామకృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యుడు, నెల్లూరు పార్టీకి పెద్ద దిక్కు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డిల సమక్షంలో గూడూరు నియోజకవర్గ శాసనసభ్యుడు వరప్రసాద్‌ని ఇతర నాయకులని పిలిపించి అసలేం జరుగుతోంది అంటూ ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5గంటల దాకా దాదాపు 6గంటల పాటు సుదీర్ఘ సమీక్ష చేశారని తెలిసింది.

ఈ సందర్భంగా నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, కొడవలూరు ధనుంజయరెడ్డి, పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిలను ఒక్కొక్కరినిగా పిలిచి విచారించారని వార్త. ఇక్కడ అందరూ ముక్తకంఠంతో వరప్రసాద్ వ్యవవహార శైలిపై తీవ్రంగా మండిపడినట్లు, కొందరైతే ఏకంగా యంయల్‌ఏ కామెంట్లు, చీవాట్లు, సవాళ్ళను రికార్డు చేసి మరీ వినిపించినట్లు తెలుస్తోంది.

## తీరు మార్చుకోవాలి - రామ్‌కుమార్‌రెడ్డి

ముందుగా రాంకుమార్‌రెడ్డిని పిలిచి నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాల పట్ల విచారిస్తుండగానే.. వరప్రసాద్ కల్పించుకుని ఆయనకేమీ ఇబ్బందులు లేవు నానా, అయన మండలం వరకు అన్నీ ఆయన అనుకున్నట్లే చేస్తున్నాం అని చెప్పడంతో ఆగ్రహించిన రాంకుమార్‌రెడ్డి ముందు తనను మండలానికే పరిమితం చేస్తున్నారా లేక నియోజకవర్గం చూడమన్నారా...? అని నిలదీయడంతో సజ్జల కల్పించుకుని అలా అంటారేమిటి యంఎల్‌ఏ గారూ.. గూడూరు నియోజకవర్గం విషయంలో రాంకుమార్‌రెడ్డి సూచనలు సలహాలు పరిగణనలోకి తీసుకోమని సార్ దగ్గరనుండి మాకు స్పష్టమైన ఆదేశలున్నాయని చెప్పడంతో వరప్రసాద్ ఖంగుతిన్నాడట. వరప్రసాద్ చేస్తున్న దండకాలతో పాటు నియోజకవర్గంలో కల్పిస్తున్న ఇబ్బందికర పరిస్థితుల గురించి రామ్‌కుమార్‌రెడ్డి తనదైన స్టైల్‌లో పార్టీ పెద్దల ముందు ఏకరవు పెట్టాడని, యంయల్‌ఏ తీరు మార్చుకోవాలని సూచించాడని తెలిసింది.

## ప్రతిపక్ష యంఎల్‌ఏతో వేగినట్లుగా వుంది -ధనుంజయరెడ్డి

ఈ యంఎల్‌ఏ మన పార్టీ వాడిలా ప్రవర్తించడం లేదని, ఈయన వ్యవహారం తీరు తలనొప్పిగా తయారయ్యిందని కొడవలూరు ధనుంజయరెడ్డి వాపోయాడట. కేశవరం, తిన్నెలపూడి గ్రామాలలో మన పార్టీ కోసం పనిచేసిన వారికే కాకుండా ప్రతిపక్ష పార్టీలో వున్నవారికి యంపిటిసి బి-ఫారాలు ఇవ్వడంలోనే ఆయన తీరు అర్ధమైపోతుందని. తెలుగుదేశం హయాంలో అక్రమాలకు పాల్పడిన నలుగురిని (దుష్ట చతుష్టయం) పక్కన పెట్టుకుని వారికి ప్రాధాన్యత కల్పించడం మంచిది కాదని చెప్తూ, ఆయన మీద గౌరవంతో పూలమాల వేయడానికి వచ్చిన పార్టీ నాయకులను అందరిముందు రాస్కెల్, స్కౌండ్రల్ అని తిట్టడం కూడా మానుకోవాలని హితవు పలికాడట. ఒక అగ్ర కులానికి చెందిన వారిని తొక్కేయండి, నలిపెయ్యండి అంటూ చేసిన ఫోన్ సంభాషణ, వీడియో రికార్డింగులు పార్టీ అధిష్టానం ముందు పెట్టినట్లు సమాచారం.

## ప్రతి విషయంలో నన్ను వ్యతిరేకిస్తున్నాడు, బెదిరిస్తున్నాడు కూడా... -పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి

యం.యల్.ఏ ప్రతి చిన్న విషయంలోనూ జోక్యం చేసుకుని తనను వ్యతిరేకిస్తున్నాడని, కనుపూరు ముత్యాలమ్మ దేవస్థానం, మల్లాం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానాలలో అర్హత కలిగిన వ్యక్తులను అధిష్టానం ఆశీస్సులతో ఛైర్మెన్‌లుగా నియమిస్తే తప్పేమిటని, అలా చేసినందుకు బహిరంగంగా తనను విమర్శిస్తున్నాడని పేర్నాటి శ్యాం ధ్వజమెత్తాడు.

కొన్ని వందల కుటుంబాల ఆరోగ్యానికి సంబంధించిన కోట మండలం కొత్తపట్నం తోళ్ళ పరిశ్రమ యాజమాన్యంతో లాలూచీ పడి అక్కడ పరిశ్రమ ఏర్పాటుకు యంయల్‌ఏ పావులు కదుపుతున్నాడని, కొన్ని సంవత్సరాలుగా అక్కడ పరిశ్రమ రావడాన్ని స్థానికులతో కలిసి అడ్డుకుంటున్నామని చెప్తూ అక్కడ కూడా రాజకీయం చేస్తూ తనపై అర్ధంలేని విమర్శలు చేస్తూ నిరాధారమైన నిందలు వేస్తున్నాడని శ్యాం చెప్పాడట. ఎమ్మెల్యేగా గెలిచిన క్షణం నుండీ దండకాలే

(మిగతా 8వ పేజీలో)








కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఈ నెల 28న తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని కలిశారు. కోవూరు నియోజకవర్గంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న షుగర్ ఫ్యాక్టరీ జీతాల బకాయిలు, ప్రభుత్వ ఆసుపత్రిలో పడకల పెంపు, పెన్నా నదిపై సబ్‌మెర్సిబుల్ కాజ్‌వే పనుల మంజూరు గురించి చర్చించారు.

# అయ్యోరి బిడ్డ.. ఐపీయస్ అయ్యాడు

## - కష్టపడ్డాడు.. అనుకున్న లక్ష్యం సాధించాడు



***'అయ్యోరి బిడ్డ ఐపీయస్ అయ్యాడంటూ ఆ ఊరు ఊరంతా సంతోషపడిపోతోంది. కష్టపడితే దేన్నయినా సాధించవచ్చు. అందుకే కష్టేఫలీ.. అన్నారు పెద్దలు. కష్టపడి చదువుకుంటే ఎంతో మంచి ఉద్యోగాలు, ఉన్నతస్థానాలు సంపాదించి సమున్నత శిఖరాలను అధిరోహించవచ్చు. అందుకు ప్రత్యక్షసాక్ష్యం.. కొమ్మి ప్రతాప్ శివకిశోర్. తొలి ప్రయత్నంలోనే ఆ యువ కిశోరం ఐపీయస్‌కు ఎంపిక కావడమేకాక, సొంత రాష్ట్ర క్యాడర్‌కు రావడం, ట్రైనీ ఐపీయస్‌గా కర్నూలు జిల్లాకు వెళ్ళడం..ఎంతో అభినందనీయం..మన జిల్లాకే గర్వకారణం.***

కలువాయి మండలంలోని మాదన్నగారిపల్లెకి చెందిన కొమ్మి నారాయణ-నిర్మలమ్మల కుమారుడే ఈ యువ ఐపీయస్. నారాయణ ఆత్మకూరులో చాలాకాలంగా ఉపాధ్యాయునిగా పనిచేశారు. ప్రస్తుతం అనంతసాగరం మండలంలోని మంచాలపల్లిలోని జంగాలకాలనీలో అయ్యోరి ఉద్యోగం చేస్తున్నాడు. వీరి కుమారుడైన కొమ్మి ప్రతాప్ శివకిశోర్.. పేరులోనే కాదు..చదువులోనూ కిశోరం లాగానే రాణిస్తూ చిన్నతనం నుంచి అందరి అభినందనలు అందుకునేవాడు. కృష్ణాపురంలోని నవోదయ పాఠశాలలో 9-10 తరగతులు చదివాడు. టెన్త్‌లో 92.8శాతం మార్కులతోనూ, ఇంటర్‌లో 92 శాతం మార్కులతోనూ ఉత్తీర్ణుడయ్యాడు. ఆ తర్వాత ఖరగ్‌పూర్ ఐఐటిలో చేరేందుకు ప్రవేశపరీక్ష రాసి 3700 ర్యాంకు సాధించాడు. బిటెక్, ఎంటెక్ కూడా పూర్తిచేసి ఫైనాన్స్ కెమికల్ ఇంజనీరింగ్‌లో పట్టా పొందాడు. ఆ తర్వాత అక్కడే ప్రాంగణ ఎంపికల్లో బాష్ కంపెనీలో సీనియర్ డేటా సైంటిస్టుగా ఉద్యోగం సంపాదించాడు.

## గట్టి సంకల్పంతోనే విజయం :

అంతటితో ఆగకుండా నాలుగేళ్ళుగా అక్కడ విధులు నిర్వహిస్తూనే బలమైన సంకల్పంతో సివిల్స్ రాసేందుకు కూడా సన్నద్ధమయ్యాడు. ఐఐటిలో తనకు సీనియర్‌గా ఉన్న రాకేష్, ఖరగ్‌పూర్ డైరెక్టర్ ప్రతీమ్ చక్రవర్తిల స్ఫూర్తితో 2018లో సివిల్స్ పరీక్షల్లో విజేతగా నిలిచాడు. తొలి ప్రయత్నంలోనే 153వ ర్యాంకు పొందడం..అనుకున్న లక్ష్యాన్ని విజయవంతంగా సాధించి, ఐపియస్‌గా సొంత రాష్ట్ర క్యాడర్‌కు ఎంపికకావడం ఎంతో విశేషం. డిజిపి గౌతం సవాంగ్ ఇటీవలనే కిశోర్‌ను ట్రైనీ ఐపిఎస్‌గా కర్నూలు జిల్లాకు కేటాయించారు కూడా. అయితే కరోనా నేపథ్యంలో మూడు నెలలపాటు డిజిపి కార్యాలయం నుంచే విధులు నిర్వహించాలని చెప్పడంతో ప్రస్తుతం ఆయన అక్కడే పనిచేస్తున్నాడు. తాను ఇంతస్థాయికి వచ్చేందుకు తన తల్లిండ్రులు, గురువులే ప్రధాన కారణమని కిశోర్ ఎంతో సంతోషంతో చెప్తున్నాడు. వారి స్ఫూర్తితో సమాజానికి మంచి సేవలందించాలనేదే తన సంకల్పమని ఆయన అంటున్నాడు. కష్టపడి చదువుకుని ఉత్తమ లక్ష్యంతో ఉన్నతశిఖరాలను అందుకుంటూ సింహపురి కీర్తిని చాటుతున్న.. సింహపురి ముద్దుబిడ్డ.. మన జిల్లా యువకిశోరం.. ప్రతాప్ శివకిశోర్‌కు.. 'లాయర్' అభినందనలు!..

నెల్లూరు కబుర్లు

# రోజూ 5వేల మందికి పరీక్షలు

## కరోనా నియంత్రణే లక్ష్యం - జిల్లా కలెక్టర్



జిల్లాలో కరోనా వ్యాధి నియంత్రణే లక్ష్యంగా అధికారయంత్రాంగమంతా పనిచేస్తోందని, గతంలో కంటే ఎక్కువగా ఇప్పుడు రోజుకు 5వేల మందికి పరీక్షలు చేసేందుకు చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈనెల 27న ఆయన నెల్లూరు మూలాపేటలోని ఇఎస్ఆర్ఎం స్కూల్‌లో సంజీవని బస్సు ద్వారా చేపడుతున్న కరోనా నిర్ధారణ పరీక్షలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు జరిగిన వెంటనే డేటా నమోదు ప్రక్రియను కూడా పూర్తిచేసేందుకు తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కరోనా వైరస్ పరీక్షల్లో పాజిటివ్‌గా గుర్తించిన వారికి వైద్యసేవలు అందించడం ఎంతో ముఖ్యమైన విషయమని, కరోనా లక్షణాలు ఉన్నవారు 1077, 104 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు అందించి పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ తెలిపారు. కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో రానున్న రెండుమూడు నెలలు ఎంతో కీలకమని, ఈ వైరస్ నియంత్రణకు ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను, ముందుజాగ్రత్తలను అందరూ తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ప్రజలు స్వీయనియంత్రణలో ఉండాలని, అత్యవసరమై బయటకు వచ్చినప్పుడు మాస్కు ధరించడంతో పాటు భౌతిక దూరం పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యమని సూచించారు. కలెక్టర్‌తో పాటు నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### మైహార్ట్ ఫౌండేషన్

## రక్తదాన శిబిరం

నెల్లూరు నగర శివారుల్లో ఉన్న కొత్తూరు టైలర్స్ కాలనీలో ఈనెల 26న మైహార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ్యులు, స్థానిక యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ వైద్య సిబ్బంది, సభ్యులు యువకుల నుంచి రక్తాన్ని సేకరించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఖాజా రసూల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సభ్యులు ఖాజా రహంతుల్లా, అజిమ్, అబ్దుల్ కరీమ్, గౌస్ అజీజ్, రాజేష్, బాబు తదితరులు పాల్గొన్నారు. ఫౌండేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో 70 మంది యువకులు రక్తదానం చేశారని నిర్వాహకులు చెప్పారు.

### వీర్రాజు నియామకం

## సంతోషదాయకం

బిజెపి రాష్ట్ర అధ్యక్షునిగా సోము వీర్రాజును నియమించడంపై జిల్లాలోని పార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్, నాయకులు కోట వెంకటేశ్వర్లు, రాధాకృష్ణలు ఈనెల 28న విడుదల చేసిన ప్రకటనలో సోము వీర్రాజు నాయకత్వంలో పార్టీ రాష్ట్రంలో మరింత బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### కరోనా బాధితులకు

## చికెన్, కోడిగుడ్డు

**- నెల్లూరు ఆర్డీఓ ఆదేశం**

నెల్లూరులోని ప్రతి క్యారంటైన్ కేంద్రంలో ఉంటున్న కోవిడ్ బాధితులకు పౌష్టికాహారం ఇవ్వాలని, వారికి కోడిగుడ్డు, చికెన్ ఇచ్చేలా చూడం డంటూ నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 27న నగరంలోని దర్గామిట్టలో ఉన్న హరిత హోటల్ క్వారంటైన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ మధ్యాహ్నభోజనం నాణ్యతను, మెనూని పరిశీలించారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

## విఆర్ఓలకు బదిలీలు

జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న 28 మంది విఆర్ఓలను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఈనెల28న ఉత్తర్వులు జారీ చేశారు.

### పెద్దాసుపత్రి

## కోవిడ్ విభాగం తనిఖీ

నెల్లూరు నగరంలోని పెద్దాసుపత్రిలో ఉన్న కోవిడ్ విభాగాన్ని జేసీ ఆసరా శీనానాయక్ ఈనెల 26న తనిఖీ చేసి కోవిడ్ వైరస్ సోకిన రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కోవిడ్ రోగుల రిసెప్షన్, అడ్మిషన్స్, హెల్ప్ డెస్క్ తదితర బోర్డులను ఏర్పాటుచేయించారు. పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ సుధాకర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బోడిగాడితోట పేదోళ్ళకి ఇళ్ళు

**- మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్**



నెల్లూరులోని బోడిగాడి తోటలో నివసిస్తున్న పేదోళ్ళకి కల్లూరుపల్లిలో పక్కాఇళ్ళు కట్టిస్తున్నామని, ఆర్టీసి సంస్థ ద్వారా వీటి నిర్మాణాలు జరుగుతున్నాయని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డా.పి.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలసి ఆయన కల్లూరుపల్లిలో ఇళ్ళ నిర్మాణాలు జరుగుతున్న స్థలాలను ఈనెల 28న పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బోడిగాడితోటలో నివసిస్తున్న 275 కుటుంబాలకు ఇళ్ళు కడుతున్నారని, ఆగస్టు 1వ తేది నాటికి తొలి దశలో 90 కుటుంబాలకు ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు. మిగిలిన కుటుంబాలకు కూడా త్వరలోనే ఇళ్లను కేటాయిస్తామన్నారు. ఇక్కడ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, మంచినీటి సదుపాయం వగైరాలన్నీ కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వైకాపా నాయకులు ఓబిలి రవిచంద్ర, వేల్పుల అజయ్, నూనె మల్లికార్జున, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### 'నాడు-నేడు'లో

## రెండోస్థానంలో నిలిచిన జిల్లా

**అభినందించిన జేసీ ప్రభాకర్‌రెడ్డి**

బడుల బాగు కోసం రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నాడు-నేడు' పనుల్లో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 25న ఆయన నెల్లూరులోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రెండు నెలల క్రితం ఈ పనుల్లో మన జిల్లా 13వ స్థానంలో ఉండేదని, తాను జేసీగా బాధ్యతలు చేపట్టాక నిత్యం సమీక్షిస్తూ పనులు వేగవంతం చేయడంతో జిల్లా ద్వితీయస్థానంలో నిలవడం తనకెంతో సంతోషంగా ఉందని అన్నారు. అందుకు సహకరించిన అధికారులకు ఆయన ఈ సందర్భంగా తన అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి జిల్లాను ఈ అభివృద్ధి పనుల్లో అగ్రభాగాన నిలపాలని ఆయన ఆకాంక్షించారు.

## అవినీతి అక్రమాలకు తావివ్వవద్దు

**కొత్త విఆర్ఓలకు డిఆర్ఓ మార్గదర్శకాలు**

విఆర్ఏలుగా పదోన్నతులు పొందిన విఆర్ఓలు అంకితభావంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, ఎలాంటి పరిస్థితిలోనూ అవినీతికి, అక్రమాలకు తావివ్వవద్దని డిఆర్ఓ జి.మల్లికార్జున కొత్త విఆర్ఓలకు మార్గదర్శనం చేశారు. ఈనెల 27న ఆయన విఆర్ఏల పదోన్నతుల కౌన్సిలింగ్‌ను కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. అర్హులైన 183 మంది విఆర్ఏలకు విఆర్ఓలుగా పదోన్నతులు కల్పించి, పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, కలెక్టరేట్ ఏ.ఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పంట రుణాలు చెల్లిస్తే.. వడ్డీ రాయితీ

బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలను సకాలంలో తీరిస్తే 4 శాతం వడ్డీ రాయితీ ఉంటుందని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ ఆనందకుమారి తెలిపారు. ఈనెల 25న నెల్లూరులోని వ్యవసాయ కార్యాలయంలో ఆమె బ్యాంక్ అధికారులు, వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2019-20కి గాను ఖరీఫ్ పంట రుణాలను తీసుకున్న రైతులు సెప్టెంబర్‌లోపు చెల్లిస్తే వడ్డీ రాయితీ వర్తిస్తుందని చెప్పారు. రబీ పంట రుణాలను అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు బ్యాంకులు అందజేస్తాయని, రుణాలు పొందినవారు 12 నెలల్లో చెల్లిస్తే రాయితీ లభిస్తుందని చెప్పారు.

## అధికారులకు కృతజ్ఞతలు

ఇటీవలే పదోన్నతులు పొందిన పలువురు విఆర్ఓలను నెల్లూరులోని ఏపిఆర్ఎస్ఏ కార్యాలయంలో ఈనెల 28న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘం నాయకులు అభినందించారు. సంఘం రాష్ట్ర నాయకుడు చొప్పా రవీంద్రబాబు మాట్లాడుతూ విఆర్ఏలకు విఆర్ఓలుగా పదోన్నతులు కల్పించినందుకు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును, జేసీ వినోద్‌కుమార్, డిఆర్ఓ మల్లికార్జునలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏనుగు రమణారెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ చేజర్ల సుధాకర్‌రావు, విఆర్ఏ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## పెన్నా, సంగం బ్యారేజీలను త్వరగా పూర్తిచేయండి

జిల్లాలోని రైతాంగానికి ప్రాణప్రదమైన పెన్నా, సంగం బ్యారేజీ పనులను తొందరగా పూర్తిచేయాలని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ నీటిపారుదల అధికారులను ఆదేశించారు. ఈనెల 28న నెల్లూరులోని ఇస్కాన్‌సిటీలోని తన క్యాంప్ కార్యాలయంలో జిల్లాలోని నీటిపారుదల, తెలుగుగంగ, సోమశిల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఆయా బ్యారేజీ పనులు ఎలా జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీ పనులను ఈ ఏడాదిలోగా పూర్తిచేయాలని మంత్రి చెప్పారు. జిల్లా రైతులకు రెండో పంటకు నీళ్ళందించే విషయం కూడా ఈ సమావేశంలో అధికారులతో ఆయన చర్చించారు.

## ఇళ్ళ స్థలాల లేఅవుట్లలో.. పచ్చదనం నింపాలి

**డ్వామా ఇన్‌చార్జి పి.డి సుశీల**

పేదలకు ప్రభుత్వం కేటాయించనున్న ఇళ్ళస్థలాల లేఅవుట్లలో ఈనెల 30 లోపు పచ్చదనం నింపాలని, జగనన్న పచ్చతోరణం కార్యక్రమాన్ని ఈ లేఅవుట్లలో పూర్తిస్థాయిలో చేపట్టాలని డ్వామా ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ సుశీల సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 25న ఆమె నెల్లూరులోని డ్వామా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఆగస్టు 15న 1.3 లక్షల మంది మహిళలకు ఇళ్ళస్థలాలను పంపిణీ చేయనున్నామన్నారు. జిల్లాలో 1407 లేఅవుట్లకు గాను ఇప్పటిదాకా 1250 సిద్ధం చేయడం జరిగిందని, ఈ లేఅవుట్లలో ఉపాధి హామీ పథకం ద్వారా త్వరితగతిన మొక్కలు నాటాలని సూచించారు. ఉపాధి పనులకు వచ్చేవారిని అధికసంఖ్యలో నియమించుకోవాలని, వారికి సకాలంలో నగదు చెల్లించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పి.డి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## 8 మందికి కారుణ్య నియామకాలు

ప్రభుత్వశాఖల్లో పనిచేస్తూ మృతిచెందిన వారి కుటుంబసభ్యులను ఆదుకునేందుకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పిస్తూ జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఈనెల 28న ఉత్తర్వులు జారీచేశారు. డిఆర్ఓ మల్లికార్జున వారికి ఆ నియామకపత్రాలను మంగళవారం అందజేశారు. యశ్వంత్, పెంచలకుమార్, సతీష్, మధు, అనీష్‌అహ్మద్‌లను జూనియర్ అసిస్టెంట్లుగా, అంకయ్య, సందీప్ చక్రవర్తి, మల్లీశ్వరిలకు ఆఫీస్ సబార్డినేట్లుగా ఉద్యోగావకాశం కల్పించారు. కలెక్టరేట్ ఏఓ రామారావు, ఏ-సెక్షన్ సూపరింటెండెంట్ హేమాద్రిరాజు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులను బాధించకండి

**-యానాదుల సంఘం రాష్ట్ర నాయకుడు పెంచలయ్య**

అల్లూరు చెరువులో చేపలు పట్టుకునే హక్కు కోసం ఇటీవల ఉద్యమించిన గిరిజన మహిళపై పోలీసుల వేధింపులను ఆపాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య కోరారు. నెల్లూరులోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఈనెల 25న ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమాయకులైన గిరిజనులను బాధించవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్, చేవూరు సుబ్బారావు, చెంబేటి సుమతి, యల్లంపల్లి రమేష్, ఏకొల్లు లక్ష్మి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.




# అరివీర భయంకర యుద్ధ విమానాలు..

# 'రఫేల్'.. వచ్చేశాయి!

**అరివీర భయంకరమైన 'రఫేల్ యుద్ధ విమానాల' రాకతో భారత రక్షణ రంగ చరిత్రలోనే ఒక అపూర్వ అధ్యాయం ప్రారంభమైంది. ఈనెల 29న ఆ అద్భుత ఘట్టం భారత భూభాగంపై ఆవిష్కృతమైంది. భారత వాయుసేన పోరాట సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ అత్యంత సమర్థవంతం..వేగవంతం..అత్యాధునికమైన అయిదు 'రఫేల్' యుద్ధ విమానాలు భారత్‌కు చేరుకోవడం ఒక అద్భుత దృశ్యం. ఫ్రాన్స్‌లోని మెరిగ్నాక్ వైమానిక స్థావరం నుంచి దాదాపు ఏడువేల కిలోమీటర్లు ప్రయాణించి ఈ రఫేల్ విమానాలు హర్యానాలోని అంబాలా వైమానిక స్థావరాన్ని చేరుకున్నాయి.**

## అత్యంత శక్తివంతం.. 'రఫేల్'

రఫేల్ యుద్ధ విమానాలు అత్యంత శక్తిసామర్థ్యాలు కలిగి ఉంటాయి. వీటి ఇంజన్ సామర్థ్యం చాలా ఎక్కువ. తమ బరువుకంటే 1.5 రెట్లు ఎక్కువ బరువు మోసుకుపోయే సత్తా వీటికి ఉంది. విమానం బరువు 10వేల కిలోలుంటే, 24,500 కిలోల బరువున్న సామగ్రిని కూడా తీసుకువెళ్ళగలదు. అంతేకాదు, ఎక్కడా ఆగకుండా 3,700 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలగడం, 60 వేల అడుగుల ఎత్తువరకు ఎగరగలడం వంటి అసాధారణ శక్తి సామర్థ్యాలు రఫేల్ విమానాల సొంతం. ఒకేసారి ఎనిమిది లక్ష్యాలపై గురిపెట్టగలిగే అసాధారణ ప్రజ్ఞాపాటవాలు కూడా వీటికి ఉన్నాయి. చైనా యుద్ధవిమానాలైన జే-20 విమానాల కంటే ఈ 'రఫేల్' విమానాలు అత్యంత శక్తివంతమైనవి కావడం విశేషం.

చైనాతో సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో నిప్పులు చిమ్ముతూ నింగినుంచి పిడుగుల వాన కురిపించే మన దేశ వాయుసేనకు తోడుగా, భారత్ సైనికశక్తిని మరింత బలోపేతం చేసేందుకు వీలుగా అత్యంత శక్తివంతమైన ఈ విమానాల రాకతో భారత్ సైనికశక్తి మరింతగా పెంపొందుతుంది. చైనా, పాకిస్తాన్ సరిహద్దు వివాదాల నేపథ్యంలో అణ్వస్త్రాలతో కూడా దాడి చేయగల సామర్థ్యం ఉన్న ఈ విమానాలు భారత్ అమ్ములపొదిలో పాశుపతాస్త్రాల్లా చేరుకోవడం శత్రువుల గుండెల్లో గుబులు పుట్టించే విషయ మమే. ఫ్రాన్స్ నుంచి 36 రఫేల్ విమానాలను కొనుగోలు చేసేందుకు 2016లో ఎన్డీఏ ప్రభుత్వం 59 వేల కోట్ల రూపాయల విలువైన ఒప్పందం కుదుర్చుకోవడం, దానిలో భాగంగా ఈ అయిదు విమానాలు ఫ్రాన్స్ నుంచి ఇక్కడికి రావడం జరి గింది. భారత వైమానిక దళ ఎయిర్ చీఫ్ మార్షల్ భదౌరియా సమక్షంలో వీటికి స్వాగతం పలుకుతూ జలఫిరంగు లతో వందనం సమర్పించారు. పాకిస్తాన్‌తో సరిహద్దు నుంచి కేవలం 220కిలోమీటర్ల దూరంలో ఉండడంతో భారత్‌కు ఈ అం బాలా వైమానిక స్థావరం వ్యూహా త్మకంగా అత్యంత కీలకం కూడా.



రఫేల్ పైలట్లతో ఎయిర్‌చీఫ్ మార్షల్ భదౌరియా

### జాతి రక్షణకు మించిన ధర్మం లేదు

**- ప్రధాని మోడీ**

రఫేల్ యుద్ధ విమానాల రాక సందర్భంగా మనదేశ ప్రధాని మోడీ 'జాతి రక్షణకు మించిన ధర్మం లేదు. దేశభద్రతకు మించిన అత్యుత్తమ యజ్ఞం లేదు' అని, భారత్ కీర్తిప్రతిష్టలు సము న్నతంగా ఆకాశాన్ని తాకాలని ఆకాంక్షిస్తూ సంస్కృతంలో ట్వీట్ చేయడం భరతజాతిని పుల కించేలా చేసింది.

### భారత సైనికచరిత్రలో నవశకానికి నాంది

**- రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్**

మన ప్రాదేశిక సమగ్రతకు ముప్పు కలిగించా లనుకునేవారికి రఫేల్ రాకతో వెన్నులో వణుకు పుడుతుందని భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ట్వీట్లు చేశారు. భారత్ భూభాగంలోకి రఫేల్ యుద్ధ విమానాలు దిగడం మన దేశ సైనిక చరిత్రలో నవశకానికి నాంది అని, ఈ ఘట్టం మన దేశానికే గర్వకారణమని అభివర్ణించారు.

---

● తీపి కబురు

# చక్కెర ఫ్యాక్టరీ సిబ్బందికి మంచిరోజులు

- **23 కోట్ల దాకా ఉన్న జీతాల బకాయిలు ఇచ్చేందుకు గ్రీన్‌సిగ్నల్**
- **ఎమ్మెల్యే ప్రసన్నకు.. ముఖ్యమంత్రి జగన్ హామీ**

కోవూరు చక్కెర ఫ్యాక్టరీ సిబ్బందికి మళ్ళీ మంచి రోజులు రాబోతున్నాయి. దాదాపు ఏడేళ్ళ క్రితం మూతబడడంతో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు ఇంత కాలంగా జీతాలు అందక ఎంతో ఇబ్బం దులు పడుతున్నారు. అందరూ తీవ్ర నిరాశానిస్పృహలో ఉన్న ప్రస్తుత తరు ణంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జీతాల బకాయిలను చెల్లించి సిబ్బందిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్ సానుకూలంగా స్పందించడం, సుమారు 23కోట్ల దాకా ఉన్న బకాయిలు చెల్లించే దుకు రాష్ట్ర ప్రభుత్వం దస్త్రాలు కది లించడంతో కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మి కుల్లో సంతోషం వెల్లువెత్తుతోంది. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఈనెల 28న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలో కలిసి కోవూరు నియో జకవర్గ సమస్యలను విన్నవించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఫ్యాక్టరీ ఎలా మూత పడిందీ, ఏళ్ళ తరబడి జీతాలు అందక కార్మికులు ఎంతగా నష్టపోతున్నదీ.. ఆ వైనాన్నంతా ప్రసన్న ముఖ్యమంత్రికి వివ రించారు. దీంతో కార్మికుల జీతాల బకా యిల విడుదలకు ముఖ్యమంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఇంత కాలంగా చేదు జీవి తాలను అనుభవిస్తున్న కోవూరు చక్కెర ఫ్యాక్టరీ కార్మికులు ఎంతో ఆనందిస్తున్నారు.

**ముదివర్తి నుంచి ముదివర్తిపాళెం దాకా కాజ్‌వే:**

కోవూరు నియోజకవర్గం విడవలూరు లోని ముదివర్తి నుంచి ఇందుకూరుపేట మండలం ముదివర్తిపాళెం మధ్య కాజ్‌వే నిర్మాణానికి, కోవూరు ప్రభుత్వ వైద్యశాలను 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసే దుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని ఈ సంద ర్భంగా ప్రసన్న సంతోషం వ్యక్తం చేశారు.



మైపాడు చెరువు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేస్తున్న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎమ్మెల్యే ప్రసన్న

## మైపాడు చెరువు అభివృద్ధికి శ్రీకారం

ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం గ్రామంలో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఎమ్మెల్యే ప్రసన్నతో కలసి ఈనెల 30న పర్యటించి ఎంతో ప్రసిద్ధమైన గంగపట్నం చాముండేశ్వరి అమ్మవారి దేవాలయంలో పూజలు చేసిన అనంతరం వీరిరువురు మైపాడుకు వెళ్ళి అక్కడ చెరువు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ ఏడాది కౌలురైతులకు కూడా రైతుభరోసా పథకం వర్తించేలా ప్రభుత్వం కృషిచేస్తోందని కలెక్టర్ అన్నారు. ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ మైపాడు చెరువు నాలుగు గ్రామాలకు సంబంధించినదని, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి, జలవనరులశాఖ మంత్రి డా.పి.అనిల్‌కుమార్‌ల సహకారంతో ఈ చెరువు అభివృద్ధి పనులకు అనుమతులు లభించాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.




విక్రమ సింహపురి యూనివర్శిటీ రిజిస్ట్రార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా జూలై 27వ తేదీ సోమవారం 'లాయర్' పత్రిక కార్యాలయానికి విచ్చేసిన ఎల్.విజయకృష్ణారెడ్డిని స్నేహపూర్వకంగా సత్కరించి 'లాయర్' ప్రచురించిన 'సింహపురికి వన్నెతెచ్చిన వనితలు' కాఫీటేబుల్ బుక్‌ను అందజేస్తున్న శివప్రభాత్‌రెడ్డి(ప్రభు).

## అన్నదాతలకు అండగా వైకాపా ప్రభుత్వం

**- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



అన్నదాతల సంక్షేమానికి అనేక పథకాలను అమలుచేస్తూ రాష్ట్రంలోని వైకాపా ప్రభుత్వం రైతులకు ఎంతగానో అండదండలందిస్తోందని వైకాపా రాష్ట్ర నాయకుడు నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి చెప్పారు. వాకాడులో ఏర్పాటుచేయనున్న అదనపు ధాన్యపు గోడౌన్‌ల నిర్మాణానికి ఆయన ఈనెల 26న శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వాకాడులో రైతులకు అవసరమైన ధాన్యం గోడౌన్లు లేకపోవడంతో కోటీ 20లక్షల రూపాయల వ్యయంతో ప్రభుత్వం వాటిని ఏర్పాటు చేస్తోందన్నారు. అంతేకాక కోట మండలంలోని విద్యానగర్ నుంచి వాకాడు మండలంలోని కొడివాక గ్రామం దాకా 15 కోట్ల రూపాయలతో రోడ్డు విస్తరణ పనులను ప్రభుత్వం చేపట్టనుందని చెప్పారు. ఈ ప్రాంత ప్రజలు, రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సమస్యలు పరిష్కరిస్తానని, తన తండ్రి మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఆశయాలను నెరవేరుస్తామని ఆయన చెప్పారు.



# ముఖ్యమంత్రిని కలిసిన ఎల్లసిరి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంప్ ఆఫీస్‌లో గూడూరు వైకాపా నాయకుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి ఇటీవల కలసి గూడూరు నియోజకవర్గ సమస్యలను విన్నవించారు. వివిధ అభివృద్ధి పనుల గురించి చర్చించారు. దివంగత మహానేత డాక్టర్ వైయస్ ప్రభుత్వంలో ప్రారంభమై, ఆ తర్వాత ఆయన మరణానంతరం అసంపూర్తిగా నిలిచిపోయిన గూడూరు రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేయించవలసిందిగా ఆయన సిఎంను కోరారు. అందుకు స్పందించిన ముఖ్యమంత్రి తన వ్యక్తిగత కార్యదర్శిని పిలిచి ఆ పనిని త్వరలోనే పూర్తిచేయించాలని ఆదేశించినట్లు ఎల్లసిరి తెలియజేశారు. జిల్లా వైకాపా అధికార ప్రతినిధి నాసిన నాగులు, గూడూరు పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు తదితరులు ఎల్లసిరితో పాటు ముఖ్యమంత్రిని కలిశారు.

## కోవిడ్ క్వారంటైన్ సెంటర్‌కు
# నెల్‌కాస్ట్ వితరణ



గూడూరు గాంధీనగర్‌లోని కోవిడ్ క్వారంటైన్ సెంటర్‌కు పడకలు, మంచాలు అవసరమని ఇటీవల సబ్‌కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ నెల్‌కాస్ట్ పరిశ్రమ వారికి తెలియజేయగా స్పందించిన నెల్‌క్యాస్ట్ యాజమాన్యం 25 బెడ్స్, 25 మంచాలను అందజేసింది. వాటిని వైకాపా నాయకుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ చేతులమీదుగా క్వారంటైన్ సెంటర్‌కు అందజేశారు. అందుకు నెల్‌కాస్ట్ పరిశ్రమ యాజమాన్యానికి సబ్‌కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. నెల్‌కాస్ట్ సీనియర్ జీఎం (ఆపరేషన్స్) ఎన్. సుదర్శన్‌రెడ్డి, జిఎం ఫైనాన్స్ దువ్వూరు రవీంద్రనాధ్‌రెడ్డి, మేనేజర్ (పిఆర్) అనిమెళ్ళ శివకుమార్, తహశీల్దార్ బాలలీలారాణి, హిందూధర్మ పరిరక్షణ ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ కోట సునీల్‌కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉమ పాల్గొన్నారు.



**ఈ నెల 26వ తేదీ కొనిదల ముని రామయ్య 3వ వర్ధంతిని పురస్కరించుకుని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ మునిగిరీష్, ముని భాస్కర్‌లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కనుమూరు హరిచంద్రారెడ్డి చేతుల మీదుగా గూడూరు రైల్వేస్టేషన్ మాస్టర్ పి.వెంకటేశ్వరరావుకు రెండు స్ట్రెచర్లు, ఒక వీల్‌చైర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.**

# ఇలా అయితే ఎలా నాన్నా...

(5వ పేజీ తరువాయి)

పరమావధిగా నియోజకవర్గాన్ని నాశనం చేస్తున్నాడని, ఒక తరుణంలో తనకు బెదిరింపులు కూడా వచ్చాయని, ఈయన విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని వైయస్ఆర్ పార్టీ ఎమ్మెల్యేగా వుంటూ ఆ పార్టీకే నష్టం కలిగేలా ప్రవర్తిస్తే చూస్తూ సహించబోమని ఖరాకండీగా చెప్పాడట శ్యామ్. ఈ ముగ్గురి ఫిర్యాదులు ఓపిగ్గా విన్న పార్టీ పెద్దలు సజ్జల, విపిఆర్, బాలినేనిలు అన్ని విషయాలను నోట్ చేసుకుని నియోజకవర్గ పరిస్థితులు, జరిగిన సమావేశం వివరాలను సార్ దృష్టికి తీసుకువెళ్తామని, ఈ విషయంలో తుది నిర్ణయం ఆయనే తీసుకుంటారని అంటూ పంచాయితీని ముగించినట్లు రాజధాని వార్త. మొత్తానికి గూడూరు వ్యవహారం చిలికి చిలికి గాలివానలా మారింది.

# వాకాడులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మండలకేంద్రమైన వాకాడులోని అశోకస్తంభం సెంటర్ విద్యానగర్ నుండి కొడివాక వరకు ఆర్అండ్‌బి రోడ్డు, వ్యవసాయ మార్కెట్ దుకాణాల సముదాయాలకు ఈనెల 27న గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు, తిరుపతి ఎంపి బల్లి దుర్గాప్రసాద్‌రావు శంకుస్థాపన చేశారు. మాజీ ముఖ్యమంత్రి తనయుడు, వైకాపా రాష్ట్ర నాయకుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దుగరాజపట్నం రోడ్డు విస్తరణలో భాగంగా కోట మండలంలోని విద్యానగర్ నుంచి వాకాడు మండలంలోని కొడివాక గ్రామం దాకా చేపట్టనున్న పనులకు వీరు శంకుస్థాపన చేశారు. 15 కోట్ల రూపాయలతో ఈ రోడ్డు విస్తరణ పనులు, వ్యవసాయ మార్కెట్ కమిటీకి అనుసంధానంగా 30 లక్షల వ్యయంతో 2వేల మెట్రిక్ టన్నుల సామర్ధ్యం కలిగిన గోడౌన్ నిర్మాణాలకు ఈ శంకుస్థాపనలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో వైకాపా సీనియర్ నాయకుడు భక్తవత్సలరెడ్డి, ధనుంజయరెడ్డిలతో పాటు బల్లి కళ్యాణచక్రవర్తి, మండల కన్వీనర్లు నవతే్రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

# పోలీసులకు మాస్కులు, శానిటైజర్లు



గూడూరులోని ఎస్‌వి రత్నం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఏపి బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు శ్రీకంటి రామ్మోహన్‌రావు దాతృత్వంతో గూడూరు రెండవ పట్టణ పోలీసులకు ఇటీవల 75 శానిటైజర్లు, 100 మాస్కులను గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షుడు అనిమెళ్ళ శివకుమార్ 2వ పట్టణ ఎస్ఐ ఆదిలక్ష్మికి అందజేశారు. కరోనా విజృంభిస్తున్న ఈ తరుణంలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి శానిటైజర్లు, మాస్కులు అందజేసిన శ్రీకంటి రామ్మోహన్‌రావుకు ఎస్ఐ ధన్యవాదాలు తెలిపారు.

# నిరుపేదలకు నిత్యావసర సరుకులు



డాక్టర్ ఏపిజె అబ్దుల్‌కలాం 5వ వర్ధంతిని పురస్కరించుకుని గూడూరు మాలవ్యానగర్‌లోని ఏపిజె అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 27న 104 నిరుపేద కుటుంబాలకు దాత మీనాక్షి సుందరం సహకారంతో నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి డాక్టర్ అబ్దుల్ కలాం ఆదర్శమన్నారు. సయ్యద్ తాజుద్దీన్ మధ్యతరగతికి చెందిన వ్యక్తి అయినప్పటికీ అబ్దుల్‌కలాం పేరుతో ట్రస్ట్ ఏర్పాటుచేసి గత అయిదేళ్ళుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్సీ ఎస్టీ పోస్టల్ ఎంప్లాయీస్ నాయకులు ఆర్ గోవిందనాయక్ మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు తనవంతు సహకారం ఉంటుందన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు సయ్యద్ తాజుద్దీన్ మాట్లాడుతూ దాతల సహకారంతో తాము ఈ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీనివాసులు, షేక్ చాంద్‌బాషా, ఎంవి రవి, కె.శ్రీనివాసన్, షేక్ ఆరిఫ్, సయ్యద్ నియామతుల్లా, బర్కతుల్లా, షేక్ కరీముల్లా, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



# మద్యం దుకాణాలు మూసేయాలి

గూడూరులో మద్యం దుకాణాలను వెంటనే మూసేయాలని కోరుతూ ఈనెల 27న అఖిలభారత యువజన సమాఖ్య, తన్జీమ్ ఏ ఇన్సాఫ్ కమిటీల ఆధ్వర్యంలో స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు యాదాల సునీల్ మాట్లాడుతూ గూడూరు పట్టణంలో పాక్షికంగా లాక్‌డౌన్ అమలుచేస్తూ కరోనా కట్టడికి కృషిచేస్తున్న మునిసిపల్ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపాడు. పట్టణంలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే అన్ని రకాల దుకాణాలు తెరుస్తున్నారని, అయితే ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల దాకా మద్యం షాపులు మాత్రం తెరచి ఉంచుతున్నారని, మందుబాబులు నిబంధనలు పాటించకుండా మద్యం కొనుగోలుకు వస్తుండడంతో కరోనా వైరస్ మరింత ప్రబలే అవకాశం ఉందన్నారు. పేద ప్రజల కుటుంబాల్లో కరోనా కంటే మద్యం మహమ్మారి తీవ్ర ఆందోళనలు కలుగజేస్తోందని అంటూ మద్యం దుకాణాలను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు.

ఈ ఆందోళన కార్యక్రమంలో తన్జీమ్ ఏ ఇన్సాఫ్ కమిటీ గూడూరు డివిజన్ అధ్యక్షుడు షేక్ జమాలుల్లా, ఖాదర్‌బాషా, షఫీ మౌలానా, సయ్యద్ అస్లం, షేక్ కబీర్, సయ్యద్ నయీమ్, షేక్ చాంద్‌బాషా, షేక్ జబీఉల్లా తదితరులు పాల్గొని మద్యం దుకాణాలు మూసివేయాలని కోరుతూ మునిసిపల్ కమిషనర్ ఓబులేసుకు వినతిపత్రం అందజేశారు.

# మద్యంపై నారీమణుల భేరి



**అసలే కరోనా వ్యాధితో చస్తుంటే మధ్యలో ఈ మద్యం పేదల కొంప ముంచుతోందంటూ అనేక మంది నారీమణులు ఇటీవల నెర్నూరులో ఓ బ్రాందీషాపును మూసివేయించారు.**

# భారత రక్షణరంగ శిఖరం.. అబ్దుల్ కలాం



## డిఆర్‌డిఓ ఛైర్మెన్ సతీష్‌రెడ్డి నివాళి

భారత రక్షణరంగం చరిత్రలో అసమాన సేవ లందించిన మహామనీషి, భారతరత్న డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం అంటూ.. ఆ మహనీయుని సేవలను స్మరించుకుంటూ డిఆర్‌డిఓ ఛైర్మెన్, మన నెల్లూరీయుడైన డా.గుండ్రా సతీష్‌రెడ్డి నివాళులర్పించారు. అబ్దుల్ కలాం 5వ వర్ధంతి సందర్భంగా ఈనెల 27న ఢిల్లీలోని డిఆర్‌డిఓ భవన్‌లోని అబ్దుల్ కలాం విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి దేశానికి అబ్దుల్ కలాం చేసిన విశిష్టసేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. క్షిపణుల తయారీలో భారతదేశాన్ని శిఖరాగ్రానికి చేర్చి చరిత్ర సృష్టించారని, శాస్త్రవేత్తగా కలాం దేశంలోనే కాక, అంతర్జాతీయ స్థాయిలో ఎంతో విఖ్యాతిని పొందారని ఆయన కొనియాడారు. తన జీవితాన్ని దేశసేవకే అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలాం అని అన్నారు. కలాం సూచించిన మార్గంలో దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధిస్తోందని అన్నారు. దేశంలోని యువతకు స్ఫూర్తిప్రదాత అబ్దుల్‌కలాం అని, యువత ఆయన ఆశయాల బాటలో నడవాలని కోరారు.

# మనసున్న మారాజు.. కృష్ణారెడ్డి

## - 'గణేశం'కు నివాళులర్పించిన రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి

గణేశం కృష్ణారెడ్డి మనసున్న మంచి మనిషి అని, ఆయన సేవలు నిరుపమాన మని, ఆయన నిజాయితీ నిబద్ధత అందరికీ మార్గదర్శకమని రెడ్‌క్రాస్ కమిటీ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. పినాకిని గాంధీ ఆశ్రమానికి గణేశం కృష్ణారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈనెల 26న ఇందుకూరుపేట మండలం లోని పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో జరిగిన కృష్ణారెడ్డి సంతాపసభ కార్యక్రమంలో ఆయన పాల్గొని గణేశం కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పినాకిని సత్యాగ్రహాశ్రమం అభివృద్ధికి కృష్ణారెడ్డి చేసిన కృషి అపూర్వమన్నారు. వారి స్ఫూర్తితో ఆశ్రమం అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. తొలుత ఆశ్రమంలోని జాతిపిత మహాత్మాగాంధీజీ విగ్రహానికి, ఆశ్రమ నిర్మాణకర్త పొణకా కనకమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి అందరూ నమస్కరించుకున్నారు. కృష్ణారెడ్డి కుమారుడు సుమంత్‌రెడ్డి, కుమార్తె స్రవంతి పాల్గొని నాన్నకు నివాళులర్పించారు. తమ తండ్రి ఆశయాలను కొనసాగించేందుకు ఆశ్రమానికి తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఆశ్రమ కో-కన్వీనర్ రవీంద్రరెడ్డి, ఆశ్రమ ప్రచారకమిటీ సభ్యుడు రొంపిచర్ల శివరామయ్య, గునపాటి ప్రసాద్ రెడ్డి, మేనేజర్ రామయ్య పాల్గొన్నారు.

## సంగీత సామ్రాజ్యంలో సరికొత్త రాగంతో..

## నెల్లూరు నాదాన్ని వినిపిస్తున్న..

# సర్వేపల్లి శ్రేయ



**విద్య, వైద్య, వైజ్ఞానిక, రాజకీయ, సామజిక రంగాలలోనే కాకుండా సంగీత, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో కూడా ఈ తరం అమ్మాయిలు ఆధునిక ఆలోచనలతో ఆవిష్కరణలతో తమ సత్తా చాటుతున్నారు. అలాంటి ప్రతిభావంతులలో ఒకరే నెల్లూరుకు చెందిన కుమారి సర్వేపల్లి శ్రేయ.**



ప్రముఖ న్యాయవాదులు కీర్తిశేషులు సర్వేపల్లి మల్లికార్జున శర్మ - రాజేశ్వరమ్మల మనుమరాలు, ప్రముఖ వైద్యులు డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ - డాక్టర్ శారదల తనయ ఈ అమ్మాయి.

కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో సరికొత్త రాగాన్ని సృష్టించి ఆ రాగానికి 'నారదప్రియ రాగం' అని పేరుపెట్టింది శ్రేయ. ఈ కొత్త రాగంలో ఒక కొత్త కృతిని నారద మహర్షిపై రచించి స్వరపరిచింది కూడా. తనకు ఈ కృతి పల్లవి మొదటి వాక్యం రాగయుక్త గానంగా అవధూత దత్తపీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీవారి కృపతో అశరీరవాణిగా కలలో విన వచ్చిందనీ, దాని ఆరోహణ-అవరోహణ పరిశీలిస్తే ఆ రాగం కొత్తదనీ, అందులో ఇప్పటి వరకు ఏ కృతీ-కీర్తన రాలేదని తెలుసుకొని శ్రీ స్వామీజీ వారికి చెప్పిన వెంటనే ఆయన ఆశీర్వదించి ఆ కృతి పూర్తిచేయమని ఆదేశించారని, వారి దివ్య మంగళాశీస్సులతో తాను ఆ కృతిని పూర్తిచేయగలిగానని శ్రేయ అంటోంది.

నారదప్రియ రాగం 28వ మేళకర్త హరికాంభోజి జన్యమని కూడా శ్రేయ చెప్తోంది. దీనికి దగ్గర ఛాయలు గల రాగాలు నవరస కన్నడ, బహుదారి, నాగస్వరవళి అని తెలిపింది.

**నారదప్రియ రాగము :- (ఆరోహణ-అవరోహణ)**

స గ మ ప స

స ని ద ప మ గ స

**ఈ కృతి:-**

**ప॥** వరవీణసుత వరనారద
హరి నామసంకీర్తన గానసదా

**అ.ప॥** వరదాయకా సచ్చిదానంద
వరనాదబిందు స్వరధార సుధ

**చ॥** మహిమ స్వరూప ముని వందిత
మహి నభశ్చర శ్రేయస్కర
మహతీ ధర మహాపండితా
మహనీయ సంగీత మకరంద ప్రద

ఇప్పటికే 3 కృతులనూ, 1 కీర్తననూ, 1 తిల్లానాను స్వరపరచిన శ్రేయ, ఈ కొత్త రాగం కనుక్కోవడంతో తన నాలుగవ కృతిని చిట్టస్వర సహితంగా రచించడం తనకు ఎంతో ఆనందంగా వుందని శ్రేయ సంగీత గురువు, డా. వైజర్సు బాలసుబ్రహ్మణ్యం పొంగిపోయాడు. స్త్రీ వాగ్గేయకారులు చరిత్రలో తక్కువగా ఉన్నారనీ, ఆ లోటును శ్రేయ తీర్చి, కర్నాటక సంగీత ప్రపంచంలో గొప్ప గాయనిగానే గాక ఒక గొప్ప వాగ్గేయకారిణిగా ఎదగగల దన్న ఆశాభావాన్ని కూడా ఆయన వ్యక్తపరచాడు.

సినీ సంగీత ప్రముఖులు శైలజ, వెన్నెలకంటిలు ఈ కృతి విని శ్రేయని ఆశీర్వదించారు. మనరాష్ట్రంలోనే కాకుండా పక్క రాష్ట్రంలో ఉంటున్న ఎంతోమంది గొప్ప సంగీత విద్వాంసులు సైతం శ్రేయ ప్రతిభను కీర్తిస్తున్నారు. సంగీత ప్రపంచంలో సరికొత్త రాగంతో నెల్లూరు నాదాన్ని వినిపిస్తున్న కుమారి శ్రేయకి 'లాయర్' అభినందనలు. ఇంతటి ప్రశంసలందుకొంటున్న ఆ కృతి... యూట్యూబ్‌లోని 'సర్వేపల్లి సిస్టర్స్' చానల్ ద్వారా సంగీత ప్రియులకు వీనుల విందు చేస్తోంది.



## దేవతలు కట్టిన గుడి...

# కృష్ణపట్నం.. కామాక్షి సమేత శ్రీ సిద్ధేశ్వరాలయం

***దేవతలు కట్టిన గుడిగా ప్రసిద్ధి చెందిన ఆలయమే.. కృష్ణపట్నంలోని కామాక్షీదేవి సమేత శ్రీ సిద్ధేశ్వరాలయం. పూర్వకాలంలో దేవతలే ఇక్కడికి దిగివచ్చి సముద్రతీరంలోని ఈ సుప్రశాంత వాతావరణంలో పార్వతీ పరమేశ్వరులకు ఆలయం నిర్మించాలనుకున్నారట. ఒక్క రాత్రిలోనే ఈ కోవెలను కట్టి పూర్తిచేస్తున్న సమయంలో.. తొలికోడి కూత వినిపించడంతో తెలతెలవారుతోందని.. మిగిలిన నిర్మాణాలను వదిలేసి అంతర్ధానమయ్యారని ప్రాచీనకాలం నాటి కథనం. అలా వదిలేసిన అసంపూర్తి చిహ్నాలు నేటికీ అలాగే ఉన్నాయి.***





మన దేవాలయాలు ⑥

ముత్తుకూరు మండలంలోని సముద్ర తీరంలో ఉన్న కృష్ణపట్నం గ్రామంలో ప్రాచీనకాలం నుంచి ఉన్న ఆలయం.. కామాక్షీదేవి సమేత శ్రీ సిద్ధేశ్వరాలయం. దేవతలే దివి నుంచి భువికి దిగివచ్చి ఈ అత్యద్భుతమైన గుడిని నిర్మించారని, ఇక్కడికి వచ్చి శ్రీ సిద్ధేశ్వరుని దర్శించుకున్న భక్తుల కోరికలన్నీ సిద్ధిస్తాయని ప్రతీతి. సముద్రతీరంలో.. పశ్చిమాభిముఖంగా కొలువై ఉన్న కామాక్షీదేవి అమ్మవారు, శ్రీ సిద్ధేశ్వరస్వామివారు కృష్ణపట్నం.. ముత్తుకూరు మండలం ప్రాంతంలోని భక్తజనులందరికే కాక.. శివభక్తులందరికీ ఆరాధ్యదైవం. అంతే కాదు, ప్రాచీన శిల్పకళా వైభవానికి కూడా ఈ ఆలయం పేరెన్నికగన్నది.

### రాజుల పూజలందుకున్న ఆలయం

ప్రాచీన కాలంలో కృష్ణపట్నంకు 'కొల్లిత్తురై' (ప్రసిద్ధ రేవుపట్టణం)అని పేరు. దాదాపు వెయ్యేళ్ళ కిందట నుంచే ఇక్కడ వర్తకాలు, సముద్రం మీద ఓడల్లో వెళ్ళి.. వ్యాపారాలు బాగా జరుగుతుండడంతో ముత్తుకూరు మండలం జిల్లాకు ప్రముఖ వర్తకస్థానంగా అలరారుతుండేదని, అప్పట్లో దీనిని రేవు పట్టణం కూడా అనేవారని తెలుస్తోంది. ఇక్కడ అప్పట్లోనే అయిదువందల మందికి పైగానే విదేశీ వర్తకులు కూడా ఉండేవారని, ఈ వర్తకాల వల్ల వచ్చే ఆదాయంలో కొంతభాగాన్ని శ్రీ సిద్ధేశ్వరాలయానికి కూడా ఇచ్చేందుకు అప్పట్లోని పలువురు రాజులు, వర్తకులంతా నిర్ణయించుకుని, తమవంతు విరాళాలందించారని చరిత్రలో ఉంది. కవిసార్వభౌముడైన శ్రీనాధుని బాల్యమిత్రుడు అవచి తిప్పయ్యశెట్టి ప్రఖ్యాత సుగంధ ద్రవ్యాల వర్తకునిగా ఆ కాలంలో బాగా పేరు గడించాడని, తిప్పయ్యశెట్టి వద్ద శ్రీనాధుడు సుగంధ ద్రవ్యాలతో కూడిన తాంబూలం వేసుకునేందుకు ఇక్కడికి పలుసార్లు వచ్చాడని కూడా చరిత్ర పేర్కొంటోంది.

### 13వ శతాబ్దంలో ఆలయ పునర్నిర్మాణం

13వ శతాబ్దంలో సింహపురిసీమను మనుమసిద్ధిరాజు పాలిస్తున్న కాలంలో ఈ ఆలయాన్ని పునర్నించినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. ఈ ఆలయ అభివృద్ధికి అప్పట్లో ఆయన కేటాయించిన భూముల వివరాలు, వాటి ద్వారా వచ్చే ఆదాయంతో ఎలాంటి కైంకర్యాలు నిర్వహించారో కూడా ఈ శాసనాలు పేర్కొంటున్నాయి. కనుమరుగైపోతున్న ఈ ఆలయానికి విశేషమైన ఖ్యాతి తెచ్చిన మనుమసిద్ధి పేరును కూడా కలిపి ఆనాటి నుంచి ఈ ఆలయాన్ని మనుమసిద్దేశ్వరాలయంగా కూడా పిలిచేవారు. ఈ రాజుకు 'గండ గోపాల' అనే బిరుదు ఉండేది. ఈ పేరుతో ఇక్కడకు కొద్దిదూరంలోనే 'గండగోపాల పురం' అనే గ్రామం నేటికీ ఉంది. ఆ కాలంలో కృష్ణపట్నాన్ని గండ గోపాల పట్నం అని కూడా పిలిచేవారు. మహాకవి తిక్కన కూడా ఇక్కడికి వచ్చి సిద్ధేశ్వరుని దర్శించుకుని పూజలు చేశారు. 1450 కాలంలో మహా మండలేశ్వర తిరుమల దేవమహారాజు పాలనలో ఈ ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరగడం ప్రారంభమయ్యాయని కథనాలున్నాయి.

### కళ్ళు చెదిరే..శిల్పకళా వైభవం

కృష్ణపట్నం సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ముఖమండపంగా నిర్మించిన రాతి మండపం నాటి కాలపు రాజుల శిల్పకళావైభవానికి ప్రతీకగా
ఉంటుంది. శిల్పకళ అంతా ఈ మండపంలోనే కొలువై ఉందా అన్నట్లుగా ఉంటుంది. ఇక్కడున్న నాగశిలలు, నవగ్రహాల మండపం ఎంతో మహిమాన్వితమైనవి. నాగదోషం ఉన్న భక్తులెందరో ఈ ఆలయానికి వచ్చి పూజలు చేసుకుని నాగదోషం నుంచి నివారణ పొందుతుంటారు. వేయి శివాలయాలను దర్శించుకున్న పుణ్యం.. శ్రీ సిద్ధేశ్వరస్వామిని దర్శించుకుంటే కలుగుతుందని ప్రతీతి.

అందులోనూ మహాశివరాత్రి రోజున శ్రీ సిద్ధేశ్వరస్వామి దర్శనం.. సర్వపాప హరణం, సకల పుణ్యదాయకం కనుక.. భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి విచ్చేసి సముద్రస్నానాలాచరించి కామాక్షీదేవి సమేత శ్రీ సిద్ధేశ్వరస్వామిని దర్శించుకుని తరిస్తుంటారు.

# వాక్సిన్‌కి డిమాండ్ ఉంటుందా..?



**డా. ఎ.వేణుగోపాలరెడ్డి**
**హైదరాబాదు.**

***చాలామందిలో ఇప్పడికే యాంటి బాడీస్ సహజంగానే ఉత్పత్తి అయ్యి రోగనిరోధక శక్తి పెరుగుతోంది. ఇలాంటి తరుణంలో వాక్సిన్ సాధ్యమైనంత త్వరలో మార్కెట్లోకి తేకపోతే చాలా కంపెనీలు తీవ్రంగా నష్టపొయ్యే అవకాశం వుంది. అందుకే ఈ ఉరుకులు, పరుగులు.***


హెర్డ్ ఇమ్యూనిటి(సమూహ రోగనిరోధకత) వచ్చే లోపల వాక్సిన్ అమ్మేసు కోవాలి... ఇదీ వాక్సిన్ సంస్థల తాపత్రయం. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఉత్సాహంగా కోవిడ్-19 వాక్సిన్ తయారుచేసే పనిలో 150 సంస్థలున్నాయి. వీటిలో 15 సంస్థలు బాగా ముందంజలో ఉన్నాయి. కానీ ఇప్పుడా సంస్థలకు కొత్త సమస్య వచ్చిపడింది. ఈ సంస్థల ప్రయోగాల వేగంకన్నా కరోనా వైరస్ చాలా వేగంగా ఉంది. ఇప్పటికే అనేకమందికి సోకి వారిలో రోగ నిరోధక వ్యవస్థని ఉత్తేజితం చేసింది. ICMR సీరో సర్వే ప్రకారం ఢిల్లీలో 23% మందిలో యాంటి బాడీస్ ఉన్నాయి. థయిరోకేర్ వారి యాంటీ బాడీ టెస్టుల ప్రకారం భారత్ దేశంలో 15 % మందిలో రోగ నిరోధకత యాంటీ బాడీస్ ఉన్నాయి. అంటే ఇప్పటికే 18 కోట్ల మంది భారతీయులలో రోగ నిరోధకత వచ్చిందని థయిరోకేర్ వారి అంచనా. వివిధ దేశాల్లో చేసిన సీరో సర్వేలు కూడా ఇదే తేల్చాయి. ఇలా సహజ మార్గంలో ప్రవేశించిన వైరస్ వారిలో యాంటిబాడీస్ ఉత్పత్తితో పాటు టి సెల్స్ ఉత్తేజం అయ్యేలా చేసింది. వాక్సిన్ చేయాల్సిన పని వైరస్ సహజంగా చేసేస్తోంది. దీనిని సహజ రోగ నిరోధకత అంటారు. వాక్సిన్ ఇచ్చినపుడు కూడా జరిగేది ఇదే. మరి రెండింటికి తేడా ఏమిటంటే సహజ రోగనిరోధకత ప్రక్రియలో మనిషిలో కొంత నష్టం జరుగుతుంది. కృత్రిమ రోగ నిరోధకత (వాక్సిన్)లో అటువంటి నష్టం ఉండదు. రెండిటి గమ్యం ఒకటే, ఫలితం ఒక్కటే. నిజం చెప్పాలంటే కృత్రిమ రోగ నిరోధకత కంటే సహజ రోగ నిరోధకత ఎక్కువకాలం ఉంటుంది, ఖచ్చితంగా పని చేస్తుంది కూడా.

ఎక్కడ వైరస్ వ్యాప్తి బాగా ఉందో అక్కడ ఇప్పటికే 25% మందిలో రోగ నిరోధకత ఉంది. కొందరిలో యాంటి బాడీస్ సంఖ్య తగ్గిపోయినా రోగనిరోధకత ఉంది. అంటే మెమరీసెల్స్ ఉత్పత్తి అయిందన్నమాట. ఇంకొంత మందిలో అంతర్గత రోగ నిరోధకత ఉంది. మరికొంత మందిలో త్వరలో వచ్చేస్తుంది. ఇదంతా చాలా వేగంగా జరుగుతుంది. ఎందుకంటే ఈ వైరస్ అంటుకునే వేగం ఎక్కువ. ఇంత త్వరగా గతంలో ఏ వైరస్ వ్యాప్తి చెందలేదు. వాక్సిన్ తయారీ దశలు అన్నీ పాటిస్తే వచ్చే మార్చి వరకు కూడా వాక్సిన్‌లు విడుదల కావు. కానీ వైరస్ వ్యాప్తి ఇలాగే కొనసాగితే డిసెంబర్ వరకు ప్రపంచ వ్యాప్తంగా అందరికి హెర్డ్ ఇమ్యూనిటి వస్తుంది. ఇక వాక్సిన్‌తో పనే ఉండదు. అందుకే, కొన్ని దశలను ప్రక్కకి పెట్టి వాక్సిన్‌ను శరవేగంగా మార్కెట్లోకి తేవడానికి కొన్ని సంస్థలు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. లేదంటే వారు పెట్టిన పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఉంది. మరి ఇలా హడావుడిగా వాక్సిన్ తెస్తే ఆరోగ్య సమస్యలు ఉండవా...? అంటే పెద్ద ఇబ్బందులు ఉండకపోవచ్చు, ఇది ఒక మాములు వైరస్. 10వేల మందిలో ఒక్కరిని ఇబ్బంది పెట్టే వైరస్, వాక్సిన్ తయారు చేసేపుడు దీనిలో ఉండే ప్రమాదకర లక్షణాలు తొలిగిస్తున్నారు, అందువల్ల ఆరోగ్య సమస్యలు పెద్దగా ఉండకపోవచ్చు, కానీ దీనిని పూర్తిగా తోసిపుచ్చలేము కూడా. ఇది సాధారణ వైరస్ కాబట్టే ఇంత త్వరగా, ఇన్ని సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న ఎయిడ్స్ లాంటి వాటికి ఇప్పటికీ వాక్సిన్ ఇస్తామని ఏ సంస్థ గట్టిగా చెప్పడం లేదు.

హెర్డ్ ఇమ్యూనిటి గనుక వస్తే డిశెంబర్ తరువాత వాక్సిన్‌కు పెద్దగా డిమాండ్ ఉండకపో వచ్చు... అందుకే ఈ హడావుడి ప్రయోగం. గతంలో వచ్చిన వాక్సిన్లు అన్నీ కూడా దశాబ్దాల తరబడి పరిశోధనలు, అనేక ప్రయోగాలు చేసిన తరువాతే మార్కెట్లోకి విడుదల చేశారు. ఆ దశలన్ని దాటి ప్రతి 100వాక్సిన్ ప్రయోగాలకు కేవలం 6 మాత్రమే మార్కెట్లోకి వస్తాయి. ఇంత పరిశోధన చేసి విడుదల చేసిన వాక్సిన్‌లతో కూడా సాధారణ సైడ్ ఎఫెక్ట్స్‌తో పాటు సీరియస్ సైడ్ ఎఫెక్ట్స్ ఉంటున్నాయి. అటు వంటిది పూర్తి స్థాయి పరీక్షలు చేయకుండా వాక్సిన్‌ను మార్కెట్లోకి విడుదల చేస్తే ఎక్కువ దుష్పరిణామాలు ఉండే అవకాశం ఉంది. అన్ని ప్రయోగాలు ఖచ్చితంగా నిర్వహించి మాత్రమే వాక్సిన్‌లను విడుదల చేయాలి. మనం కూడా వాక్సిన్ కోసం వేచి చూడకుండా మనల్ని మనం కాపాడుకునే పద్ధతులు ఆచరించాలి. ప్రభుత్వాలు చెపుతున్న అన్ని జాగ్రత్తలు పాటిస్తేనే మనం ఈ వైరస్‌ని ఎదుర్కోగలం.

## కరోనాతో కొత్తపాఠాలు నేర్చుకున్నాం...

# కోవిడ్ కష్టాలను అధిగమించాం




కరోనాతో కొత్త పాఠాలను నేర్చుకున్నామని, కోవిడ్ కష్టాలను శ్రీసిటీ అందరి సమిష్టికృషితో అధిగమించిందని శ్రీసిటీ ఎం.డి రవీంద్రసన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. అందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం అమోఘమని ఆయన కొనియాడారు. శ్రీసిటీ పరిసరాల్లో ఇళ్ళ నిర్మాణాలు, ఉద్యోగుల కొరతను భర్తీ చేసేందుకు ప్రత్యేకదృష్టి సారించామన్నారు. రీబూట్ ఏపి వెబినార్ (ఆన్‌లైన్) సదస్సులో రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డితో పాటు, వివిధ పారిశ్రామిక రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సదస్సులో శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ రకరకాల ఉత్పత్తులు, పలు దేశాల పరిశ్రమలకు నిలయంగా ఉన్న శ్రీసిటీలో కరోనా ప్రభావం మొదట్లో కలకలం రేపిందని, అయితే ప్రభుత్వ సహకారం, శ్రీసిటీ కుటుంబం తీసుకున్న పలు వినూత్నమైన చర్యల ద్వారా కోవిడ్‌ను ఎంతో సమర్థవంతంగా ఎదుర్కొని, శ్రీసిటీ కరోనా రహిత జోన్‌గా నిలిచిందని అన్నారు. ముఖ్యంగా రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి మూడుసార్లు శ్రీసిటీకి వచ్చి పరిశ్రమలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సకాలంలో స్పందించారని, కోవిడ్ నివారణకు అవసరమైన పిపిఇ కిట్‌లు, ఆక్సిజన్ సిలిండర్లు, మందులు, పడకలు తదితర ఉత్పత్తులకు సంబంధించిన 12 పరిశ్రమలు అమోఘంగా పనిచేశాయని, ఆ తర్వాత ప్రభుత్వ నిబంధనల సడలింపులతో అన్ని పరిశ్రమలు ఉత్పత్తులు మొదలుపెట్టాయని వివరించారు. కోవిడ్ ప్రభావిత ప్రాంతాల నుంచి ఉద్యోగులు రాలేకపోవడంతో ఇంకా ఉద్యోగుల కొరత ఉందని, 50వేల మంది పనిచేస్తున్న శ్రీసిటీలో ఇప్పుడు 15వేల మందే పని చేస్తున్నారని, కరోనా ప్రభావం ఇంకా కొంతకాలం కొనసాగే సూచనలు ఉండడంతో కోవిడ్‌ను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సంసిద్ధంగా ఉన్నామన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు వచ్చేందుకు, పరిశ్రమలకు ఉద్యోగుల కొరత తీర్చేందుకు, నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేకచర్యలు చేపట్టాలని, కోవిడ్ అనంతరం పలు పరిశ్రమలు శ్రీసిటీకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు.

వీక్షణం

- మంజీర

## మంత్రి మాట...

# అక్షరాలా గాలికి

కరోనా సంక్షోభం దాదాపుగా అన్ని రకాల ఉపాధిరంగాలను స్తంభింప చేసింది. మూడు నెలల పాటు ఆగిపోయిన పనులు మళ్లీ తొలి అడుగులు వేస్తూ మెల్లగా గాడిన పడుతున్నాయి. విద్యారంగాన్ని కూడా గాడిన పెట్టాలి. పిల్లల భవిష్యత్తును దారిలో పెట్టాలి. ఇందుకోసం ప్రభుత్వాలు కొత్త క్యాలెండర్‌లను సిద్ధం చేసుకుంటున్నాయి. స్కూల్ వర్కింగ్ డేస్‌ను తగ్గిస్తున్నాయి. పాఠ్యాంశాలను పునః సమీక్షించుకుని సిలబస్‌ను తగ్గిస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం కూడా అదే దారిలో 2020-21 విద్యా సంవత్సరం కోసం క్యాలెండర్ తయారీలో నిమగ్నమైంది. ఆగస్టు 3వతేదీ అన్నారు విద్యామంత్రి ఆదిమూలపు సురేశ్. ఇటీవల తాజాగా సెప్టెంబర్ 5వ తేదీని ఖరారు చేశారు. అంటే... మన రాష్ట్రంలో 2020-21 విద్యా సంవత్సరం ఇంకా మొదలు కాలేదన్న మాట. షెడ్యూల్ ప్రకటించేటప్పుడు మంత్రిగారు 'విద్యాసంవత్సరం ఇంకా మొదలు కాలేదు. ప్రైవేట్ స్కూల్స్ ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు' అని గట్టిగా ఒక హెచ్చరిక కూడా చేశారు. 'ఆన్‌లైన్ క్లాసులంటూ పిల్లలను వేధిస్తే చర్యలు కఠినంగా ఉంటాయి' అని మరీ మరీ చెప్పారు. మంత్రి గారి మాట అక్షరాలా అమలవుతోందా?

### ఇది నిజం

రాష్ట్రంలో ప్రైవేట్ స్కూళ్లలో ఎన్‌రోల్ అయి ఉన్న పిల్లలను కదిలిస్తే నిజాలు గంగాప్రవాహంలా బయటికొస్తాయి. 'మా ఇంట్లో ఒక్క ల్యాప్‌టాపే ఉంది. ల్యాప్‌టాప్‌ని అన్నయ్యకి ఇచ్చేస్తారు. నన్ను మొబైల్ ఫోన్‌లో క్లాసు వినమంటారు' అని ఫిఫ్త్ క్లాస్ చదువుతున్న కుర్రాడు ఆరోపిస్తాడు. తల్లిదండ్రులు తొమ్మిదో తరగతి చదువుతున్న అన్నయ్యకి ఇచ్చిన ప్రాధాన్యం తనకు ఇవ్వడం లేదని, తనకు ఎదురవుతున్న వివక్ష మీద గళం విప్పుతాడు. మరో ఇంట్లో పదేళ్ల అమ్మాయి... 'మా ఇంట్లో స్మార్ట్ ఫోన్ ఒక్కటే ఉండేది. అక్క పెద్ద క్లాసని ఆ ఫోన్‌ని అక్కకి ఇచ్చేసేది మా అమ్మ. ఇద్దరికీ ఒకే టైమ్‌లో ఆన్‌లైన్ క్లాసులు ఉంటున్నాయి. నేను క్లాస్ మిస్సవుతున్నానని ఇప్పుడు నా కోసం మరో ఫోన్ కొన్నది' అని తన కొత్త ఫోన్ చూసుకుంటూ సంతోషంగా చెప్తుంది. ఈ ఇద్దరే కాదు... పదేళ్ల నుంచి పదిహేనేళ్ల వయసున్న పిల్లలను ఎవరిని కదిలించినా సరే ఆన్‌లైన్ క్లాసుల మాట లేకుండా రెండు నిమిషాలు కూడా టాపిక్ సాగడం లేదు. మరి... మంత్రి మాట ఏమైనట్లు? మంత్రిగారు అంత గట్టిగా చేసిన హెచ్చరికలు ఏమవుతున్నాయి? అంత దర్జాగా మంత్రి మాటను గాలికి వదిలేయగలుగుతున్న కరడు గట్టిన వ్యవస్థ ఏది?

### చై-నా మాఫియా

ప్రైవేటు విద్యారంగం అక్షరాలను రూపాయల్లోకి మార్చేసింది. ప్రత్యామ్నాయ విద్యావ్యవస్థ కాస్తా ప్రధాన స్రవంతి విద్యావ్యవస్థగా రూపాంతరం చెందింది. చై-నా ఎడ్యుకేషన్ మాఫియా అనే మారు పేరుతో రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తరించిన ఈ ప్రైవేట్ రంగానికి ప్రభుత్వ ఆదేశం పట్టదా? పట్టదు, పట్టడం లేదనే చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ (ఏపీఎస్ఈఆర్ఎమ్‌సీ) మాత్రం ఇంకా విద్యా సంవత్సరం మొదలు కాలేదని స్పష్టం చేసింది. జిల్లా విద్యాధికారులు తమ వంతు బాధ్యతగా ప్రైవేటు స్కూళ్లకు ఆదేశాలు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. 'ఆన్‌లైన్ క్లాసులు జరుగుతున్నట్లు మాకు కంప్లయింట్‌లు రాలేదు. కంప్లయింట్ వస్తే తప్పని సరిగా చర్యలు తీసుకుంటాం' అని అధికారిక చట్రంలో ఆచితూచి స్పందిస్తున్నారు అధికారులు.

### కంప్లయింట్ ఎవరివ్వాలి?

'మా స్కూలు వాళ్లు ఆన్‌లైన్‌లో క్లాసులు చెబుతున్నార'ని పిల్లలు ప్రభుత్వానికి కంప్లయింట్ చేయగలుగుతారా? 'మా పిల్లలు చదువుతున్న స్కూలు యాజమాన్యం ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తోంద'ని ఏ తల్లిదండ్రులైనా ప్రభుత్వానికి కంప్లయింట్ చేయగలుగుతారా? అలా ఒకసారి కంప్లయింట్ చేసిన వాళ్లకు మరే ప్రైవేట్ స్కూలయినా అడ్మిషన్ ఇస్తుందా? ప్రభుత్వం మాత్రం ఆన్‌లైన్ సౌకర్యం ఉన్న విద్యార్థులు(హైటెక్), రేడియో, దూరదర్శన్ సౌకర్యం మాత్రమే ఉన్న విద్యార్థులు(లో టెక్), కంప్యూటర్, మొబైల్, రేడియో, దూరదర్శన్ వంటివి ఏమీ అందుబాటులో లేని విద్యార్థులు(నో టెక్) అని సమాజాన్ని వర్గీకరించి సెప్టెంబర్ 5వ తేదీ నుంచి మొదలయ్యే విద్యా సంవత్సరానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. టీవీ లేని పిల్లలకు అంగన్‌వాడీ సెంటర్‌లలో ఏర్పాటు చేయనుంది. గడచిన విద్యా సంవత్సరానికి పదవ తరగతి వారికి విద్యామృతం(దూరదర్శన్ ద్వారా వీడియో పాఠాలు), విద్యా కలశం(ఆకాశవాణి ద్వారా రేడియో పాఠాలు), విద్యావారధి(పునఃశ్చరణతో వీడియో పాఠాలు) నిర్వహించి సిలబస్ పూర్తి చేసింది. ఈ కరోనా సమయంలో పిల్లలు ఎట్టి పరిస్థితిలోనూ స్కూలుకు రాకూడదని చెప్పింది. ప్రైవేట్ స్కూళ్లలో 'స్కూలుకు రావద్ద'న్న ఆ ఒక్క ఆదేశం మాత్రమే అమలవుతోంది. ఆన్‌లైన్ క్లాసుల మీద నియంత్రణ లేదు. ప్రైవేటు విద్యా వ్యవస్థ మీద అధికారుల పట్టు జారిపోయింది. ఇక ఆచరణ సాధ్యమైన నిఘా వ్యవస్థ వాలంటీర్ వ్యవస్థ మాత్రమే. వాలంటీర్‌లకు ఈ బాధ్యత కూడా అప్పగిస్తే ఏ ఇంట్లో పిల్లలు, ఏ సమయంలో ఆన్‌లైన్ క్లాసుకు హాజరవుతున్నారో, ఆ పిల్లలు ఏ స్కూల్లో చదువుతున్నారనే వివరాలు కూడా అందించగలుగుతారు.

## మొక్కలు నాటిన పోలీసులు

'జగనన్న పచ్చతోరణం' కార్యక్రమంలో భాగంగా ఈనెల 26న పొదలకూరు పోలీసులు పంచాయతి పరిధిలోని చిట్టేపల్లి తిప్ప వద్ద ఇళ్ళస్థలాల కోసం ఏర్పాటుచేసిన లేఅవుట్‌లలో మొక్కలు నాటారు. పొదలకూరు సిఐ గంగాధర్‌రావు, ఎస్ఐ రహీం రెడ్డి, కండలేరు డ్యామ్ ఎస్ఐ ప్రియాంక తదితరులు మొక్కలు నాటారు. సిఐ గంగాధర్‌రావు మాట్లాడుతూ పొదలకూరు, కండలేరు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 300 మొక్కలు నాటుతున్నామని చెప్పారు.

# కమలం 'కాపు' కాస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

కాపులు గత కొంతకాలంగా రాజ్యాధికారం కోసం పోటీకి సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే చిరంజీవి, పవన్‌కళ్యాణ్‌లాంటి వాళ్ళు వచ్చినా విజయం సాధించ లేకపోవడంతో బీజేపీ తాజాగా ఆ సామాజికవర్గాన్ని కాపు కాసేందుకు సిద్ధమైంది. దీంతో అదే సామాజిక వర్గానికి చెందిన 'కన్నా'ని తీసేసి మరింత దూకుడుగా వ్యవహరించే అసలు సిసలైన కాషాయ నేత సోము వీర్రాజుని కమల దళపతిగా నియమించి తన ఉద్దే శాన్ని స్పష్టం చేసింది.

మొదటినుంచి టీడీపీని, ఆ పార్టీ అధినేత చంద్ర బాబునాయుడుని పూర్తిగా వ్యతిరేకించే సోము వీర్రాజు అధికార వైసీపీ పట్ల కొంత సానుకూలంగా వ్యవహరి స్తారనే ఆరోపణలు ఉన్నా తాజా దళపతి పాత్రలో ఎలా వ్యవహరిస్తారో చూడాల్సిఉంది. ఇప్పటికే జన సేనతో కలిసి ప్రయాణిస్తోన్న బీజేపీ 2024 ఎన్నిక లలో టీడీపీతో కలిసి బరిలోకి దిగుతోంది అన్న ఆశ లను పటాపంచలు చేసే నియామకం కావడంతో రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు మారే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. కానీ రాజకీయాలలో చురుకైన నిర్ణయాలు ఉంటాయ్ కాబట్టి ఎప్పుడు ఎలాంటి సంఘటనలు చోటు చేసుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు కానీ ప్రస్తుతానికి సోము వీర్రాజు టీడీపీ వల్లే బీజేపీ నాశనం అయింది అంటూ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా చేసిన వ్యాఖ్యలు మాత్రం కలకలాన్నే సృష్టిస్తున్నాయి.

## కన్నా తొలగింపుకి కారణాలు అనేకం...

సిద్ధాంత రాజకీయ చట్రంలో ఇమడడం అందరికీ సాధ్యం అయ్యే పనే కాదు. అందులోనూ కరుడుకట్టిన కాంగ్రెస్ నేతలకైతే అసలు కుదిరే వ్యవహారమే కాదు. సిద్ధాంతాలతో సంబంధం లేకుండా నిరంతరం రాద్ధాంతాలతో అంతులేని అంతర్గత ప్రజాస్వామ్యం కాంగ్రెస్‌లో అపరిమితం. ఆ స్వేచ్ఛను గరిష్టంగా విని యోగించుకుని, ఒకానొక సమయంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ చివరి ముఖ్యమంత్రిగా ఉండేందుకు అటు కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు ఇటు అప్పటి పీసీసీ చీఫ్ బొత్సాకి సైతం గట్టి పోటీ ఇచ్చిన కన్నా లక్ష్మీనారాయణ బీజేపీలో ఇమిడేందుకు తపస్సు చేయాల్సి వచ్చింది. అయినా ఫలితం దక్కలేదు. ఎరక్కపోయొచ్చి ఇరుక్కున్న చందాన బీజేపీ అధ్యక్షునిగా రెండేళ్ల పాటు పదవీ బాధ్యతలు నిర్వహించాడు కన్నా. ఆయన పదవీ కాలాన్ని ఇంకో టర్మ్ పెంచుతారు అనుకుంటున్న తరుణంలో పీకిపడేసి ఈసారి నిఖార్సయిన కాషాయ సైనికుడికి దళపతిగా అవకాశం కల్పించారు.

కన్నా లక్ష్మీనారాయణ తర్వాత ఏపీ బీజేపీ చీఫ్‌గా ఎమ్మెల్సీ మాధవ్ నియమితులవుతారని జోరుగా ప్రచారం జరిగింది. ఒక దశలో ఆయన నియామకం ఖరారైనట్లు కూడా వార్తలొచ్చాయి. ఇటీవలి కాలంలో యువనేత విష్ణువర్ధన్‌రెడ్డి పేరు మరింత బలంగా వినిపించింది. వారంలోగా విష్ణు పేరుతో ప్రకటన రాబోతుందని ఆయన వర్గీలు చెప్పుకున్నారు. ఎన్టీఆర్ కూతురు, మాజీ ఎంపీ పురంధరేశ్వరిని కూడా ఈ పదవి వరించబోతున్నట్లు ప్రచారం జరిగింది. కానీ చివరికి సోము వీర్రాజు సైలెంట్‌గా పదవి దక్కించు కోవడం గమనార్హం.

## కన్నా బీజేపీ అధ్యక్ష్య పదవి చేపట్టడమే సంచలనం

2014 ఎన్నికల తర్వాత స్పష్టమైన కెరీర్ హామీతో కాంగ్రెస్‌ని వీడి బీజేపీలో చేరిన కన్నా 2018 వరకు వేచి చూశాడు. బీజేపీ అధిష్టానం ఏమీ పెద్దగా పట్టించుకున్నట్టు కనిపించకపోవడంతో పార్టీ మారేం దుకు సిద్ధమయ్యాడు. 2018 ఏప్రిల్ 24న ఆయన జగన్ పాదయాత్రలో భాగంగా కృష్ణా జిల్లా గన్నవరం లో జగన్ ని కలిసి వైసీపీ లో చేరేందుకు సిద్ధమయ్యాడు. ఆమేరకు పార్టీ కార్యకర్తలు ఏర్పాట్లలో మునిగిపో యారు. అయితే ఆయన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా త్వరలోనే ప్రకటిస్తామని అమిత్ షా హామీ ఇవ్వడంతో జగన్ దగ్గరకు వెళ్లాల్సిన కన్నా తనకు అనారోగ్యం వచ్చింది అంటూ నేరుగా హాస్పిటల్‌లో జాయిన్ అయి పోయారు. అప్పట్లో ఈ వ్యవహారం సంచలనంగా మారడం, హామీ ఇచ్చినట్టుగానే 2018 మే20న బీజేపీ ఏపీ అధ్యక్షునిగా కన్నాని ప్రకటించడం రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చనీయాంశం అయ్యింది.

## కన్నాకి అధ్యక్ష పదవిని అప్పట్లోనే వ్యతిరేకించిన వీర్రాజు

అయితే అప్పుడే రాష్ట్ర అధ్యక్ష్య పదవి కోసం తీవ్రంగా ప్రయతించిన సోము వీర్రాజు కన్నాని రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. మిగతా కొందరి లీడర్ల లాగా బహిరంగంగా ఎలాంటి ప్రకటనలు చేయలేదు కానీ అంతకు మించి లోపల తన అయిష్టతను వ్యక్తం చేశాడు. అప్పటినుంచి సహాయ నిరాకరణను ప్రారంభించిన వీర్రాజు... కన్నా తప్పు లను లెక్కపెట్టడం, వాటిల్ని అధిష్టానానికి అందించ డంలో బిజీ అయిపోయాడు.


దీంతో పార్టీలో ఐకమత్యమే లేకుండా పోయింది. సంప్రదాయ బీజేపీ నేతలను ఆకట్టుకోవడంలో కన్నా ఘోరంగా విఫలమయ్యారనే చెప్పాలి. పార్టీ సిద్ధాం తాలు, వ్యూహాలను కన్నా సరిగా అర్థం చేసుకోలేక పోయారు. ముఖ్యంగా 2019ఎన్నికలలో బీజేపీ ఘోర పరాజయం నుంచి అధికార వైసీపీతో ఆయన వ్యవ హారశైలి నిరంతరం ప్రశ్నార్థకంగా మారింది. అప్పటి వరకు టీడీపీకి, వైసీపీకి బద్ధ శత్రువుగా ఉన్న కన్నా ఒక్కసారిగా టీడీపీ అమ్ములపొదిలో అస్త్రంలా మారి నట్టు అధికారపార్టీపై అంతులేని ఆగ్రహం ప్రకటిం చాడు. ప్రతిపక్షమే అయినా కూడా పార్టీ వ్యూహాల్ని అర్థం చేసుకోలేకపోవడం సిద్ధాంత రాహిత్యంగా భావించింది బీజేపీ. నిమ్మగడ్డ ఉదంతంతో పాటు రాజధాని తరలింపు లాంటి వ్యవహారాల్లో అవసరానికి మించి పార్టీ లైన్ దాటి స్పందించినట్టు ఆయన వ్యవ హార శైలి మారింది. ఇది ఏపీలో విస్తృతంగా చర్చనీ యాంశం కావడంతో బీజేపీ నష్ట నివారణ చర్యలను చేపట్టింది. వీటికి తోడు 2019 ఎన్నికలలో పార్టీ ఇచ్చిన నిధులు 30 కోట్లు దుర్వినియోగం అయ్యాయన్న ఆరోపణల్లో కన్నా పేరు ప్రముఖంగా వినిపించడంతో పార్టీలో ఆయన ప్రాధ్యాన్యత పూర్తిగా తగ్గిపోయింది.

## సోముకు అదనపు బలాలు

సోము 4 దశాబ్దాల నిఖార్సయిన కాషాయ కార్య కర్త. యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడుగా... జాతీయ కార్య వర్గ సభ్యుడిగా చాలా పదవులను అధిరోహించారు. కాపు సామాజిక వర్గం అదనపు బలం, టీడీపీతో కమ్మ, వైసీపీతో రెడ్డి ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో మూడో ప్రాధాన్య సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడం, కాస్త దూకుడుగా ఉండగలగడం, అన్నింటికీ మించి ఆర్ఎస్ఎస్ కార్యకర్తగానే కాకుండా ఉన్నతస్థాయి సంబంధాలు కలిగి ఉండడంతో బీజేపీ అధ్యక్ష పదవి ఫ్రేమ్ లో సరిగ్గా కుదిరిపోయాడు.

## సోము రాకతో ఫలితం మారుతుందా?

కన్నా స్థానంలో సోము వీర్రాజును ఏపీ బీజేపీ చీఫ్ గా నియమించే విషయంలో హైకమాండ్ పాత సమీకరణలనే నమ్ముకున్నట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరూ ఏపీలో బలమైన కాపు సామాజికవర్గానికి చెందినవారే కావడం గమనార్హం. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా అదే సామాజికవర్గానికి చెందినవారు కావడం, ఆయన బీజేపీతో కలిసి నడుస్తున్న దరిమిలా కాషాయ దళానికి మరో బలమైన సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని సారథిగా నియమిస్తే మెరుగైన ఫలితాలు రావొచ్చనే వాదన ఇటీవలి చర్చల్లో బలంగా వినిపిం చింది. కానీ హైకమాండ్ మాత్రం పాత సమీకరణల తోనే కొత్త ఫలితాన్ని రాబట్టాలని ప్రయత్నిస్తున్నట్లు సోము నియామకంతో స్పష్టమైపోయింది.



ఆలయ నమూనా


## ఆగస్టు 5న అయోధ్య రామయ్య మందిరానికి భూమిపూజ

*ఎన్నాళ్ళో వేచిన ఉదయం, ఈనాడే నిజమవుతుంటే... ఆ ఆనందం అంతా ఇంతా కాదు. ఆ సంతోషం వినిపించడానికి మాటలు సరిపోవు.*

జై హింద్... అంటూ మన దేశానికి శాల్యూట్ చేసే ప్రతి భారతీయుడి రోమం నిక్కబొడుచుకునే అరుదైన సంఘటన 2020 ఆగస్టు 5 బుధవారం నాడు అయోధ్యలో జరగబోతోంది. అయోధ్య రామయ్య ఆలయ నిర్మాణానికి పునాది రాయి పడ బోతోంది. 5వతేదీ మధ్యాహ్నం సరిగ్గా 12 గంటలా 15 నిముషాల 15 సెకన్లకు ప్రారంభమై 32 సెకన్ల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని సాక్షాత్తు భారత ప్రధాని నరేంద్ర మోడీ చేతులమీదుగా జరుపబోతు న్నాడు. ఈ మహత్కార్యం కోసం అయోధ్య ఇప్పటి నుండే ముస్తాబవుతోంది. వీధులన్నీ శుభ్రమవుతు న్నాయి, నగరమంతా అలంకరణలతో నిండిపోతోంది, అయోధ్యలోని దేవాలయాలన్నీ కొత్త కాంతులతో వెలిగిపోతున్నాయి.

ప్రధానితో పాటు ఇంకా అనేక మంది జాతీయ అంతర్జాతీయస్థాయి ప్రముఖులు ఈ బృహత్తర కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా వారి పేర్లను గోప్యంగా ఉంచారు. మొత్తం మీద 200 మందిని ఈ వేడుకకు అనుమతిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వున్న భారతీయులందరూ ఈ శంకుస్థాపన మహోత్సవాన్ని ఇళ్లలో కూర్చుని వీక్షించేలా దూరదర్శన్ ద్వారా లైవ్ ప్రసారం చెయ్యనున్నారు. భరతమాత గడ్డపై జరిగే ఈ పుణ్యకార్యాన్ని మనమూ తిలకిద్దాం, యావత్ భారతావనిని పులకింప చేయ బోయే ఈ జాతీయ పండుగను మనమూ వీక్షిద్దాం. ఆగష్టు 5వతేదీ నాడు స్వచ్ఛంద నిర్బంధాన్ని పాటించి ఇళ్లకు అంకితమవుదాం.

జై శ్రీరామ్... జై భారత్ మాత ...!



కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు

శ్రద్ధాంజలి

మా ఇంటి జ్యోతి, నిరంతరం మా హృదయాంతరాల్లో వెలిగే ధృవతార
మా అభివృద్ధికి కారకులు, అనురాగంతో మమ్మల్ని
తన గుండెలలో దాచుకున్న ప్రేమమయుడు
మా తండ్రి కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు.

01-08-2020 శనివారం ఆ మహనీయుని 43వ వర్ధంతి సందర్భంగా
వారి పవిత్రాత్మకు మా శ్రద్ధాంజలి.

కుమారులు
మాగుంట సుధాకర్‌రెడ్డి
మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎం.పి

మనుమడు
మాగుంట విజయ్‌రెడ్డి

**కరోనా దెబ్బతో...**

**ఈనాటి బంధం.. ఏనాటిదో**

## మనకు దగ్గరగా వున్నా...

# దూరమైపోతున్న మదరాసు

***మద్రాసు... మహానగరమంటే తొలినుంచీ నెల్లూరోళ్లకు మహా ఇష్టం. నెల్లూరు నగరం నుండి 110 కిలోమీటర్లు ప్రయాణించి రామాపురం వద్ద సరిహద్దు దాటితే 60 కిలోమీటర్ల దూరంలో చెన్నై మహానగరం వుంది.***




ఈ జిల్లా నుంచి ప్రతినిత్యం వేలాది మంది మద్రాసుకు వెళ్తుండడం ఎంతో కాలం నుంచి అలవాటు. ఇంట్లో ఏ శుభ కార్యం జరిగినా షాపింగుకు మద్రాసు వెళ్ళడం ఆ శుభకార్య పనుల్లో ఒక భాగం.

నిశ్చితార్థం, పెళ్ళి, రిసెప్షన్, బారసాల, బర్త్‌డే... ఇలా ప్రతి వేడుకకూ షాపింగ్ వేదిక చెన్నై. నాటి చెన్న పట్టణం నుండి నిన్నటి మద్రాసుతో సహా నేటి చెన్నై వరకూ బట్టలు, నగలు, చివరికి కొత్త కాపురం పెట్టడానికి స్టీలు సామాన్లు కావాలన్నా మద్రాసే. కుమరన్, నల్లి, పోతీస్ శిల్క్స్‌తో పాటు కంచి పట్టు చీరల కోసం కంచికి ప్రయాణం, బంగారు ఆభరణాల కోసం ఉమ్మిడి బంగారు చెట్టి, జిఆర్‌టి జ్యూయలర్స్‌కి క్యూ కట్టడం, గృహోపకరణాల కోసం శరవణ స్టోర్స్ ముందు నిలబడడం, ఇక ఇంటిల్లిపాదికి షాపింగ్ కోసం పాండీబజార్‌కు పరుగులెత్తడం... ఇదొక ఆనవాయితీ.

ఇంట్లో శుభకార్యం కుదిరి లగ్నపత్రిక రాసుకున్న వెంటనే పసుపు దంచడంతో మొదలయ్యే పెళ్లిపనులు, మద్రాసు షాపింగ్‌తో స్పీడందుకుంటాయి. ముందుగా మద్రాస్‌లోని పారిస్‌కి వెళ్లి, యాండర్‌సన్ స్ట్రీట్‌లో పెళ్లిపత్రికలు ఎంపిక చేసుకుని అక్కడనుండి గోవిందప్పనాయకన్ స్ట్రీట్‌కి వెళ్లి నేషనల్ లాడ్జిలో భోజనంచేస్తే కానీ నెల్లూరోళ్లకు పెళ్లి షాపింగ్ మొదలయినట్టు కాదు. ఇక బుహారీ బిరియానీ సంగతి చెప్పనక్కర్లేదు.

అంతేకాదు పిల్లలకు కెజి నుండి పీజీ వరకు మంచి చదువు, మంచి వైద్యం కావాలన్నా, ఇంటిని అందంగా అలంకరించుకోవడానికి మంచి ఫర్నిచర్, మంచి కర్టెన్లు ఇలా ప్రతి దానికీ మదరాసే. నెల్లూరులో చాలామంది డాక్టర్లకు, వ్యాపారవేత్తలకు ఆదివారం ఆటవిడుపు కావాలంటే చెన్నైకి వెళ్లాల్సిందే! ఆంధ్రా క్లబ్బులోనో లేక మహాలక్ష్మి క్లబ్బులోనో పేకాట ఆడాల్సిందే.

### సినీ రంగంతో అనుబంధం


సినీ ప్రపంచమంతా ఒకప్పుడు మద్రాసులోనే ఉండడం, అంతే కాకుండా జిల్లాకి అతి సమీపంలో వున్న మహానగరం కావడంతో, నెల్లూరు జిల్లాకు చెందిన అనేక మంది అక్కడకువెళ్ళి సినీరంగంతో పాటు దానికి అనుబంధ రంగాల్లో సైతం స్థిరపడిపోయారు. పలు సంస్థల్లో ఉద్యోగాల్లో చేరి జీవనం సాగిస్తున్నారు, వివిధ వ్యాపారాలలో రాణించి తమ ప్రతిభను చాటుతున్నారు. పలు నిర్మాణసంస్థల ద్వారా వేలాది ఇళ్ళు నిర్మించడమే కాకుండా, 5 నక్షత్రాల హోటళ్లను సైతం ఏర్పాటు చేసిన నెల్లూరోళ్లు చాలామంది అక్కడ ప్రముఖులుగా స్థిరపడ్డారు. భారతీయ సినిమా గాయకులు యస్‌పి బాలసుబ్రహ్మణ్యం స్థిర నివాసం ఇప్పటికీ చెన్నైలోనే. మాగుంటోళ్ల వ్యాపార కేంద్ర కార్యాలయం అక్కడే. ప్రత్యేక ఆర్థిక మండలి శ్రీసిటీ కేంద్ర కార్యాలయం చెన్నైలోనే, సీబ్రోస్, కెన్సెస్, అలయన్స్ వంటి ప్రఖ్యాత నిర్మాణ సంస్థలతో పాటు తాజ్ కోరమండల్, సవేరా, రైన్ ట్రీ, గ్రీన్ పార్క్ వంటి స్టార్ హోటళ్లన్నీ నెల్లూరోళ్ళవే.

ఉదయం చార్మినారో లేక మెమో రైలో ఎక్కేవాళ్ళు కొందరైతే, 103 బస్సులో వెళ్ళేవాళ్ళు మరికొందరు. ఈ బస్సు కోసం నెల్లూరులో ప్రత్యేకంగా 'మద్రాసు బస్టాండ్' అని ఒక సెంటరే ఏర్పడింది. ఇంక సొంత వాహనాలైతే చెప్పనవసరం లేదు. ఇక మనవాళ్లకు అరవం కొట్టిన పిండైతే అక్కడి వాళ్లకు తెలుగు మాతృభాష లాగే... ఇదీ మద్రాసుతో మనకున్న బంధం. ఇలా చెప్పుకుంటూ వెళ్తే చెన్నైతో మనకున్న అనుబంధం అనంతం. మన జిల్లాలోని అనేక కుటుంబాలు వివాహబంధాలతో కూడా చెన్నైతో ఆత్మీయ అనుభందాన్ని పెనవేసుకున్నారు. ఇలా మద్రాసుతో తరతరాలుగా స్నేహానుబంధం కొనసాగుతున్న తరుణంలో ఇప్పుడు మాయదారి కరోనా వచ్చి మద్రాసుకు వెళ్ళాంటేనే భయపడేలా చేసింది.

కరోనా దెబ్బతో ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అటు మద్రాసులోనూ.. ఇటు పక్కనే వున్న నెల్లూరు జిల్లాలోనూ కరోనా మహమ్మారి విజృంభిస్తుండడంతో జనం భయపడిపోయి అత్యవసర పరిస్థితుల్లో తప్ప సరిహద్దు దాటి వెళ్ళడం దాదాపుగా మానుకున్నారు. మద్రాసులోని ఒక్క కోయంబేడు మార్కెట్ కారణంగానే నెల్లూరు జిల్లాలో అధిక సంఖ్యలో కేసులు వచ్చాయంటే మద్రాసుతో మన లావాదేవీలు ఏ స్థాయిలో వుంటాయో ఊహించుకోవచ్చు. ఎంతో ఆత్మీయంగా ఉన్న మద్రాసు మనకు దూరమయిపోతున్నదనే ఆవేదన ఇప్పుడు అందరిలోనూ కలుగుతోంది. ఇది తాత్కాలికమే అయినప్పటికి అందరిలోనూ ఏదో తెలియని బాధ. త్వరలోనే ఈ కరోనా మహమ్మారి కబంధ హస్తాల నుండి బయటపడి సాధారణ పరిస్థితులు, మళ్ళీ పాతరోజులూ వచ్చే స్తాయని ఆశిద్దాం, ఆకాంక్షిద్దాం.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు







Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: roopagroup@yahoo.com